తిరుపతి మహానగరానికి శుక్రవారం తొలి అడుగు పడింది. మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో గ్రేటర్ ప్రతిపాదనకు సభ్యులు ఏకగ్రీవంగా జైకొట్టారు. కౌన్సిల్ ఆమోదించిన తీర్మాన ప్రతులను, విలీన ప్రతిపాదనలను కలెక్టర్ శుక్రవారమే సంబంధిత పంచాయతీల కార్యదర్శులకు పంపించారు. ఆయా పంచాయతీల నుంచీ విలీన తీర్మానాలు సేకరించి రాష్ట్ర ప్రభుత్వానికి పంపించనున్నారు. ఏది ఏమైనా డిసెంబరు నెలాఖరులోపు గ్రేటర్ తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ ఏర్పాటుపై నోటిఫికేషన్ జారీ చేయాలని ప్రభుత్వం పట్టుదలగా ఉంది. మొత్తమ్మీద ఈ ఏడాది ప్రారంభంలో సీఎం చంద్రబాబు ఇచ్చిన ఆదేశాలతో జిల్లా యంత్రాంగం చేపట్టిన కసరత్తు ఇప్పటికి ఓ కొలిక్కి వచ్చింది.

సీఎం చొరవతో ముందడుగు

సంస్కరణలకు, దార్శనికతకు పేరుపడిన సీఎం చంద్రబాబు తిరుపతి నగర అభివృద్ధిపై తొలి నుంచీ శ్రద్ధాసక్తులు చూపుతున్న సంగతి తెలిసిందే. అందులో భాగంగానే ఈ ఏడాది ప్రారంభంలో నారావారిపల్లికి వచ్చిన సందర్భంలో జిల్లా అభివృద్ధిపై కలెక్టర్‌కు పలు సూచనలు, ఆదేశాలు జారీ చేశారు. అందులో గ్రేటర్ తిరుపతి ఒకటి. అప్పట్నుంచి జిల్లా యంత్రాంగం దీనిపై కసరత్తు ప్రారంభించింది. భౌగోళికంగా ప్రజలకు గానీ, అధికార యంత్రాంగానికి గానీ అసౌకర్యం కలగని రీతిలో తిరుపతి రూరల్, చంద్రగిరి, రేణిగుంట, ఏర్పేడు మండలాల పరిధిలోని 53 పంచాయతీలకు సంబంధించిన 63 రెవెన్యూ గ్రామాలను గ్రేటర్ తిరుపతిలో విలీనం చేసేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేశారు.

- తిరుపతి, ఆంధ్రజ్యోతి

- సీఎం ఆదేశాలతో గ్రేటర్ ప్రతిపాదన
- కౌన్సిల్ ఏకగ్రీవ తీర్మానంతో తొలి అడుగు
- ఆయా పంచాయతీలకు తీర్మాన ప్రతులు పంపిన కలెక్టర్
- వాటి నుంచి తీర్మానాలు రాగానే ప్రభుత్వానికి ప్రతిపాదనలు
- డిసెంబరు ఆఖరులోగా నోటిఫికేషన్ జారీకి ప్రయత్నాలు
- సీఎం ఆదేశాలతో ఫలిస్తున్న జిల్లా యంత్రాంగం కసరత్తు

తిరుపతి మహానగరం..!


ఎస్వీయూ సెనేట్ హాల్లో కౌన్సిల్ సమావేశానికి హాజరైన మేయర్, కార్పొరేటర్లు

అనూహ్యంగా మారనున్న తిరుపతి రూపురేఖలు

గ్రేటర్‌గా మారితే తిరుపతి నగర రూపురేఖలు అనూహ్యంగా మారిపోనున్నాయి. ఇపుడు కేవలం 30 చదరపు కిలోమీటర్ల వైశాల్యం కలిగిన తిరుపతి.. 284 చదరపు కిలోమీటర్లకు విస్తరించనుంది. 4.50 లక్షల జనాభా 7.50 లక్షలకు పెరగనుంది. రూ.149 కోట్లుగా ఉన్న వార్షికాదాయం రూ.182 కోట్లకు చేరనుంది. చంద్రగిరి, రేణిగుంట వంటి మేజర్ పంచాయతీ కేంద్రాలు తిరుపతిలో అంతర్భాగం కావడంతో పాటు విమానాశ్రయం వెలుపలున్న వికృతమాల దాకా నగరం విస్తరించనుంది.

చంద్రగిరి పంచాయతీలతో అభ్యంతరాలు

చంద్రగిరి, తిరుపతి రూరల్ మండలాలకు చెందిన పంచాయతీలు తిరుపతి కార్పొరేషన్‌లో విలీనం కావడం పట్ల ఎమ్మెల్యే పులివర్తి నానీకి అభ్యంతరమేమీ లేదని సమాచారం. తిరుపతి అభివృద్ధి పట్ల ఆయనకూ ఆసక్తి ఉందని సన్నిహితులు చెబుతున్నారు. అయితే రాజకీయ కోణం నుంచి చూసినప్పుడు పంచాయతీల విలీనం కారణంగా ఆయనపై స్థానిక నేతల నుంచీ తీవ్ర ఒత్తిడి ఎదురు కానుంది. పంచాయతీ ఎన్నికలు సమీపిస్తున్న వేళ సర్పంచు పదవులపై ఆశలు పెట్టుకున్న నేతలు తాజాగా గ్రేటర్ ప్రతిపాదనలు రావడంతో నిస్పృహ చెందుతున్నట్టు చెబుతున్నారు. ఈ కారణంగానే చంద్రగిరి నియోజకవర్గంలోని పంచాయతీల విలీనం పట్ల ఎమ్మెల్యే నానీ కొంత అయిష్టంగా ఉన్నట్లు సమాచారం. అయితే సీఎం చంద్రబాబు ఆసక్తి, ఆదేశాల నేపథ్యంలో ఆయన పార్టీ నేతలను సమాధానపరిచే అవకాశాలు కనిపిస్తున్నాయి.



క్రెడిట్ కొట్టేసేందుకు వైసీపీ నేతల విఫలయత్నం

కాగా గ్రేటర్ తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ ఏర్పాటు ప్రతిపాదనలపై సీఎం ఆదేశాలను, జిల్లా యంత్రాంగం కసరత్తును పక్కన పెట్టి తాము క్రెడిట్ కొట్టేసేందుకు వైసీపీ నేతలు విఫలయత్నం చేశారు. శుక్రవారం జరిగిన కౌన్సిల్ సమావేశంలో పలువురు వైసీపీ సభ్యులు ప్లకార్డులు ప్రదర్శిస్తూ తమ డిమాండ్ మేరకు తీర్మానం పెడుతున్నట్టుగా కలరింగ్ ఇచ్చే ప్రయత్నం చేశారని కూటమి సభ్యులు ఆరోపిస్తున్నారు. గత ఐదేళ్లు వైసీపీ ప్రభుత్వమే ఉండగా, తిరుపతి కౌన్సిల్ సైతం వారి చేతుల్లోనే ఉన్నప్పటికీ గ్రేటర్ ప్రతిపాదన ఎందుకు చేయలేదని వారు ప్రశ్నిస్తున్నారు. సీఎం చంద్రబాబు ఆదేశించాక తొమ్మిది నెలల పాటు జిల్లా యంత్రాంగం చేసిన కసరత్తుతోనే ఇపుడు కౌన్సిల్ సమావేశంలో విలీన ప్రతిపాదన అజెండాలోకి వచ్చిందని చెబుతున్నారు. అవేమీ పట్టించుకోకుండా వైసీపీ నేతలు క్రెడిట్ కొట్టేసేందుకు విఫల యత్నం చేయడం చర్చకు దారి తీసింది.



ఈతకు వెళ్లిన నలుగురి గల్లంతు

- ఒకరి మృతదేహం లభ్యం.. ఆచూకీ లభించని మరో ముగ్గురు
- చీకటి, వర్షంతో గాలింపు బృందాలు వెనక్కి
- వేదాంతపురంలో విషాదం

ఒకరి పుట్టిన రోజు. సరదాగా ఈతకని వెళ్లారు. ఆ తర్వాత వచ్చి కేకు కట్ చేద్దామని ప్లాన్ చేసుకున్నారు. స్వర్ణముఖి నదిలోని ఇసుక దిబ్బపై ఆడుతూ.. నీళ్లలో దూకుతూ ఉల్లాసంగా గడుపుతున్నారు. ఆ సమయంలో పెరిగిన నీటి ప్రవాహంతో నలుగురు గల్లంతయ్యారు. వీరిలో ఒకరు చనిపోయారు. మిగతా ముగ్గురి ఆచూకీ దొరకలేదు. ఈ విషాదం తిరుపతి రూరల్‌లో చోటుచేసుకుంది.





తిరుపతిరూరల్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): తిరుపతిరూరల్ మండలం వేదాంతపురం అగ్రహారానికి చెందిన మంజుల, మునస్వామిరెడ్డి దంపతులకు బాలు, తేజు కుమారులు. చిన్నకుమారుడు బాలు పుట్టినరోజు కావడంతో శుక్రవారం పాఠశాలకు వెళ్లలేదు. మరో ఐదుగురు స్నేహితులతో కలసి సరదాగా ఈతకని స్వర్ణముఖి నదిలోకి వెళ్లారు. సాయంత్రం 4.30గంటలకి నదిలోని ఇసుకదిబ్బలపై ఆడుతూ స్నానం చేస్తున్న సమయంలో అకస్మాతుగా పెరిగిన నీటిప్రవాహానికి ప్రకాశ్(17), మునిచంద్ర అలియాస్ చిన్న(15), తేజు(19), బాలు(16) కొట్టుకుపోగా.. కృష్ణ, విష్ణు, మునికృష్ణ బయటపడ్డారు. ఈ ముగ్గురిలో ఒకరు నదిమధ్యలో చెట్టును పట్టుకుని వేలాడుతుండగా, అటువైపు వచ్చిన యువకుడు ఒడ్డుకు చేర్చారని, మిగిలిన ఇద్దరు ఇసుకదిబ్బపై నిలబడి ఉన్నారని తెలిసింది. గల్లంతైన ముగురు బాలురకోసం గాలింపు చర్యలు చేపట్టారు. ఈతకు వెళ్లిన బాలురుల్లో ఒకరు 100కి డయల్ చేయడంతో రక్షణ సిబ్బంది, గాలింపుబృందాలు నదిలోకి దిగి చర్యలు చేపట్టగా బాలు మృతదేహం బయటపడింది. చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తినానీ ఘటనా స్థలానికి చేరుకుని ఆర్డీవో రామ్మోహన్, ఏఎస్పీ రవిమనోహరాచారిని అడిగి వివరాలు తెలుసుకున్నారు. స్థానికుల ద్వారా పిల్లల వివరాలు అడిగి తెలుసుకున్నారు. సీఎం చంద్రబాబు నాయుడు, ఇన్‌చార్జి మంత్రికి ఫోన్ ద్వారా సమాచారమిచ్చామని, సీఎం దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారని నాని తెలిపారు. వైసీపీప్రభుత్వంలో స్వర్ణముఖినదిలో ఎక్కడపడితే అక్కడ ఇసుకతవ్వకాలు చేపట్టడంతో భారీగుంతలు ఏర్పడ్డాయని, నదిలో ఇసుకరవాణాకు దారి లేకుండా అన్ని దారులు మూసేసేలా చర్యలు చేపడతామన్నారు. తిరుపతిరూరల్ తహసీల్దార్ రామాంజులనాయక్, రూరల్ పోలీసులు, తదితరులు పాల్గొన్నారు. ఒకవైపు చీకటి పడటం, వర్షం కురుస్తుండటంతో గాలింపు బృందాలు వెనక్కి వచ్చాయి. మరోపక్క పోలీసులు డ్రోన్ ద్వారా పర్యవేక్షించారు. కాగా, బాపట్ల నుంచి రెస్క్యూ టీమ్ ఇక్కడికి వచ్చింది. శనివారం వేకువన 5 గంటల నుంచి గాలింపు చర్యలు చేపట్టారు. కాగా, వీరిలో ఇద్దరు ఎమ్మార్‌పల్లె జెడ్పీ హైస్కూల్‌లో పదో తరగతి.. మరో ఇద్దరు ఇంటర్ చదువుతున్నట్లు సమాచారం. ఈఘటనపై జిల్లా కలెక్టర్ తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. గల్లంతైన విద్యార్థులకోసం తక్షణమే సహాయక చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు.



డిప్యూటీ సీఎం దిగ్భ్రాంతి

తిరుపతి(కలెక్టరేట్), అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): వేదాంతపురం ఘటనపై డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢసానుభూతి తెలియజేస్తున్నట్లు ప్రకటనలో తెలిపారు. సహాయక చర్యలనుచేపట్టాలని అధికారులను ఆదేశించారు.నదులు, వాగులు ఉప్పొంగి ప్రవహిస్తుండటంతో ఈతకు వెళ్లకుండా జాగ్రత్తలు పాటించాలని, హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని ఆయన ఆదేశించారు.

తమ్ముడిని కాపాడబోయి అన్న గల్లంతు

తేజు, బాలు అన్నదమ్ములు. తేజు సాయంత్రం 4.20గంటల సమయంలో స్వర్ణముఖి సమీపంలో జీవాలను తోలుకొచ్చి మేపుతూ స్థానికులతో మాట్లాడారని అంటున్నారు. నదిలో పెద్దగా కేకలు వినబడడంతో అటువైపుగా వెళ్లి తమ్ముడు బాలును రక్షించబోయి గల్లంతయ్యాడని భావిస్తున్నారు. పెద్దకుమారుడు గల్లంతవడం.. చిన్న కుమారుడు పుట్టినరోజే చనిపోవడంతో మంజుల దంపతులు బోరున విలపించారు. వీరిని ఓదార్చడం ఎవరివల్లకాలేదు.

చల్లకాలువలో గల్లంతైన వృద్ధుడి మృతదేహం లభ్యం

కోట, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): కోట మండలం కర్లపూడి సమీపంలోని చల్లకాలువ నదిలో శుక్రవారం గల్లంతైన మాణికల పోలయ్య(68) మృతదేహం లభ్యమైంది. కర్లపూడిలోని మేకలతోక గిరిజనకాలనీకి చెందిన పోలయ్య, స్నేహితుడితో కలిసి రెండు రోజుల క్రితం చేపలు పట్టేందుకు సమీపంలోని చల్లకాలువ నదిలోకి వెళ్లారు. పోలయ్య చేపలు పట్టేందుకు వల విసురుతూ ప్రమాదవశాత్తు నదిలో పడి వరదనీటి ప్రవాహంలో కొట్టుకుపోయాడు. సమాచారం అందుకున్న తహసీల్దారు జయజయరావు, ఎంపీడీవో దిలీప్‌కుమార్ నాయక్, ఎస్‌ఐ పవన్‌కుమార్, అగ్నిమాపకశాఖ అధికారి శ్రీనివాసులు ఆధ్వర్యంలో పోలయ్య కోసం గాలించినా ఆచూకీ లభించలేదు. గురువారం గోవిందపల్లిపాళెం గ్రామానికి చెందిన మత్స్యకారులైన గజ ఈతగాళ్లను పిలిపించి పొద్దుపోయే వరకు చల్లకాలువలో గాలించినప్పటికీ పోలయ్య జాడ తెలియలేదు. శుక్రవారం ఉదయం చల్లకాలువ నదిలోని కర్రతుమ్మ చెట్ల మధ్య గల్లంతైన పోలయ్య మృతదేహం తేలియాడుతుండటాన్ని గుర్తించి బయటకు తీశారు. పోస్టుమార్టం నిమిత్తం కోట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మృతుడికి భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు.


నదిలో తేలి ఉన్న పోలయ్య మృతదేహాన్ని బయటకుతీస్తున్న అగ్నిమాపక సిబ్బంది, పోలీసులు

కాళంగిలో బయటపడ్డ గిరిజనుడి మృతదేహం

దొరవారిసత్రం, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): దొరవారిసత్రం మండలం తనియాలి ఆనకట్ట వద్ద కాళంగి నదిలో గురువారం కొట్టుకుపోయిన మేకల పోలయ్య(31) మృతదేహం శుక్రవారం లభ్యమైంది. చేపల వేటకు వెళ్లి ఆనకట్ట పైనుంచి జారి నదిలో పడిఓయిన పోలయ్య వరద ఉధృతికి కొట్టుకుపోయాడు. శుక్రవారం ఎస్‌డీఆర్‌ఎఫ్ బలగాలు నదిలో గాలించగా కమ్మకండ్రిగ గట్టు వద్ద పోలయ్య మృతదేహం నీటిపై తేలాడితుండడాన్ని గుర్తించారు. పడవ సాయంతో మృతదేహాన్ని గట్టుకు తీసుకువచ్చి సూళ్లూరుపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పోస్టుమార్టం అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు ఎస్‌ఐ అజయ్‌కుమార్ తెలిపారు.


నదిలో నుంచి పోలయ్య మృతదేహం తీసుకొస్తున్న ఎస్‌డీఆర్‌ఎఫ్ బలగాలు

స్వామి భక్తితో విధులు మరిచిన

ఏఆర్ కానిస్టేబుల్ సస్పెన్షన్

- తుపాకీ వదిలేసి భూమన వెంట ఆలయంలోకి వెళ్లిన మాజీ గన్‌మ్యాన్

తిరుపతి, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): స్వామి భక్తి ప్రదర్శించే క్రమంలో అసలు విధి మరచిపోయిన ఓ ఏఆర్ కానిస్టేబుల్ సస్పెన్షన్‌కు గురైనవైనమిది. శ్రీవారి ఆలయ భద్రతా విధుల్లో ఉంటూ తుపాకీ వదిలేసి టీటీడీ మాజీ ఛైర్మన్ భూమన కరుణాకరరెడ్డి వెంట ఆలయంలోకి వెళ్లిన మాజీ గన్‌మ్యాన్‌పై సస్పెన్షన్ వేటు పడింది. ఆలస్యంగా వెలుగు చూసిన ఈ వ్యవహారానికి సంబంధించిన పూర్వాపరాలిలా వున్నాయి. కడప జిల్లా ఎర్రగుంట్లకు చెందిన చెన్నారెడ్డి తిరుపతిలో ఏఆర్ కానిస్టేబుల్ (నంబరు 1890)గా పనిచేస్తున్నారు. వైసీపీ ప్రభుత్వంలో భూమన కరుణాకర్‌రెడ్డికి గన్‌మెన్‌గా పనిచేశారు. ఎన్నికల తర్వాత రిలీవైన ఆయన తిరుమల శ్రీవారి ఆలయం వద్ద భద్రతా విధుల్లో ఉన్నారు. ఈనెల 6వ తేదీన శ్రీవారి దర్శనం కోసం భూమన తిరుమల వెళ్ళారు. గొల్ల మండపం వద్ద బందోబస్తు డ్యూటీలో ఉన్న చెన్నారెడ్డి కరుణాకర్‌రెడ్డిని చూడగానే చేతిలోని తుపాకీని అక్కడే వదిలేసి ఆయన వెంట ఆలయంలోకి వెళ్లారు. శ్రీవారిని దర్శించుకుని వెనుదిరిగి వెళ్ళే వరకూ భూమన వెంటే ఉన్నారు. అక్కడి అధికారులు ఈ విషయాన్ని ఎస్పీ సుబ్బరాయుడి దృష్టికి తీసుకెళ్లారు. ఈనెల 6వ తేది ఉదయం 6 నుంచి 9 గంటల వరకూ చెన్నారెడ్డి గొల్లమండపం వద్ద విధుల్లో లేరని, తుపాకీ అక్కడే వదలిపెట్టేసి వెళ్లారని విచారణలో తేలింది. దీంతో ఎస్పీ సుబ్బరాయుడు ఏఆర్ కానిస్టేబుల్ చెన్నారెడ్డిని సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులిచ్చారు. మూడు గంటల పాటు తుపాకీని వదిలిపెట్టేసి వెళ్ళిపోవడాన్ని తీవ్రంగా పరిగణిస్తున్న ఉన్నతాధికారులు చెన్నారెడ్డిపై శాఖాపరమైన చర్యలకు సిద్ధమవుతున్నట్టు సమాచారం.

ఐదుగురిపై నేర నిర్ధారణ

- కఠారి దంపతుల హత్యకేసులో 16మందికి ఉపశమనం
- 27న వెలువడనున్న తుది తీర్పు

చిత్తూరు లీగల్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): చిత్తూరు మొదటి మేయర్ కఠారి అనురాధ దంపతుల హత్యకేసులో ఐదుగురిపై నేరం రుజువైందని చిత్తూరు న్యాయస్థానం శుక్రవారం ఉదయం తీర్పు ఇచ్చింది. ప్రధాన నిందితుడు శ్రీరామచంద్రశేఖర్ అలియాస్ చింటూతో పాటు ఏ2 వెంకటాచలపతి, ఏ3 జయప్రకాష్ రెడ్డి, ఏ4 మంజునాథ్, ఏ5 వెంకటేష్ నేరం చేసినట్లు రుజువైందని, వీరిని వన్ టౌన్ పోలీసులు కస్టడీలోకి తీసుకోవాలని సీఐ మహేష్‌కు న్యాయమూర్తి ఆదేశాలు జారీ చేశారు.వీరికి సంబంధించి ఈనెల 27వ తేదిన తుది తీర్పు వెల్లడిస్తామని తెలిపారు. మిగిలిన వారిపై నేరం రుజువు కానందున కేసు కొట్టి వేయబడిందని చెప్పారు.

మరో ఐదు రోజులూ భారీ వర్షాలు

తిరుపతి(కలెక్టరేట్), అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): జిల్లాలో మరో ఐదు రోజులు భారీ వర్షాలు ఉన్నాయని కలెక్టర్ వెంకటేశ్వర్ పేర్కొన్నారు. అధికారులు అప్రమత్తంగా ఉండి ప్రాణ, ఆస్తి నష్టం కలగకుండా చర్యలు చేపట్టాలని శుక్రవారం ఆదేశించారు. ఈ నెల 27 నుంచి మూడు రోజుల పాటు జిల్లాలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున ప్రజలు అవసరమైతే తప్ప బయటకు వెళ్లొద్దన్నారు. రాబోయే మూడు రోజులపాటు మత్స్యకారులు సముద్రంలో చేపల వేటకు వెళ్లొద్దని ఆయన సూచించారు ప్రజలు ఎలాంటి ప్రమాద స్థితిలోనైనా 0877-2236007లో సంప్రదించవచ్చన్నారు.

వర్షపాతం ఇలా: శుక్రవారం ఉదయం 8.30గంటల వరకు నమోదైన వర్షపాతం వివరాలు.. అత్యధికంగా కేవీబీపురం 83 మి.మీ. వాన పడింది. ఏర్పేడు, బీఎన్‌కండ్రిగ 71.8, పెళ్లకూరు 66.6, సూళ్లూరుపేట 64.8, ఎర్రావారిపాళెం 60.8, వడమాలపేట 55.8, రేణిగుంట 55.6, వరదయ్యపాళెం 51.4, పిచ్చాటూరు 50.6, నాగలాపురం 45.4, నారాయణవనం 41.8, సత్యవేడు 38.2, చంద్రగిరి 34.8, చిన్నగొట్టిగల్లు 34.4, తిరుపతి అర్బన్ 32.2, తడ 30.4, శ్రీకాళహస్తి 29.8, నాయుడుపేట 29.4, దొరవారిసత్రం 28.6మి.మీ. చొప్పున వర్షపాతం నమోదైంది.భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్న నేపథ్యంలో సెలవుల్లో ఉన్న అధికారులు, ఉద్యోగులు రద్దు చేసుకుని విధుల్లో చేరాలని కలెక్టర్ ఆదేశించారు.

వదలని జడివానతో ఇక్కట్లు




ఉధృతంగా ప్రవహిస్తున్న సుద్దేటి వంక - మొరవ పారుతున్న అనుపల్లి చెరువు

రామచంద్రాపురం, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): మండలంలో నాలుగు రోజులుగా జడివాన కురుస్తుండటంతో ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు. వ్యవసాయ పనులు పూర్తిగా స్తంభించిపోయాయి. చిరు వ్యాపారులు, కూలీలు ఇళ్లకే పరిమితమయ్యారు. అనుపల్లె చెరువు పూర్తి స్థాయిలో నిండి మొరవపారుతోంది. అనుపల్లి అడవిలో నుంచి వచ్చే సుద్దేటి వంక సుమారు పది కిలోమీటర్లు ఉధృతంగా ప్రవహిస్తుండటంతో రాయలచెరువుకు భారీగా నీరు చేరుతోంది. ఇప్పటికే సగానికిపైగా నీరు చేరింది. ఇదే వర్షం మరో వారం కురిస్తే చెరువు నిండే పరిస్థితి ఉంది. గుండాల అడవి నుంచి ప్రవహించే నక్కల వంక నెన్నూరు వద్ద కల్వర్టు దాటి ప్రవహిస్తోంది. రాయలచెరువు నీరు నక్కల వంకలో కలిస్తే 30 గ్రామాల ప్రజలకు మండల కేంద్రంతో సంబంధాలు తెగిపోతాయి. నాలుగేళ్ల క్రితం వరదల సమయంలో నక్కలవాగు రెండు నెలల పాటు ప్రజలను ఇక్కట్లకు గురిచేసింది. ఈ వర్షం ఉద్యానవన పంటలు, చెరకు తోటకు మేలు చేస్తుందని రైతులు అంటున్నారు.

సర్వే నెంబరు 353 ప్రాంతానికి అద్వైత్‌నగర్‌గా నామకరణం

తిరుచానూరు, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): తిరుచానూరు గ్రామ పంచాయతీ 9వ వార్డులో సర్వే నెంబరు 353 నంచి 399 వరకు గల ప్రాంతానికి (జిల్లా కలెక్టరేట్ వెనుక వైపు) అద్వైత్ నగర్‌గా నామకారణం చేసినట్లు పంచాయతీ కార్యదర్శి మణి తెలిపారు. స్థానికుల విజ్ఞప్తి మేరకు గ్రామసభలో తీర్మానం చేసినట్లు తెలిపారు,

ఉధృతంగా ప్రవహిస్తున్న స్వర్ణముఖి

రవణప్పగారిపల్లె, నాగయ్యగారిపల్లె, పులివర్తివారిపల్లెకు రాకపోకలు బంద్




రవణప్పగారిపల్లె ప్రవహిస్తున్న స్వర్ణముఖి నది - పులివర్తివారిపల్లె వద్ద ఏర్పాటు చేసిన హెచ్చరిక ఫ్లెక్సీ

చంద్రగిరి, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా మూడు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు చంద్రగిరి మండలంలో స్వర్ణముఖి నది ఉధృతంగా ప్రవహిస్తోంది. దీంతో పలు గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. మండలంలోని నాగయ్యగారి పల్లె వద్ద కల్వర్టు కుంగిపోవడంతో ఆ దారిలో రాకపోకలు నిలిచిపోయాయి. పనపాకం పంచాయతీ రవణప్పగారిపల్లె వద్ద స్వర్ణముఖి ఉధృతంగా ప్రవహిస్తుండటంతో ఆ గ్రామానికి రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. ఐతేపల్లె, కొటాల మార్గమధ్యంలో పులిత్తివారిపల్లి గ్రామం వద్ద ఉన్న స్వర్ణముఖి నది ఉధృతంగా ప్రవహించడం, రహదారిపై వరద నీరు వస్తుండటంతో పోలీసులు ఆ మార్గంలో రాకపోకలను తాత్కాలికంగా నిలిపివేశారు. అదేవిధంగా ఎ.రంగంపేట సమీపంలోని కళ్యాణీ డ్యామ్‌లో నీటి మట్టం పెరుగుతోంది. మూడు రోజులుగా కురిసిన వర్షానికి శేషాచలం అడవి, వాగుల నుంచి వరద నీరు ఉధృతంగా వస్తుండటంతో నీటి మట్టం పెరుగుతోంది. తుపాన్‌కు ముందు కళ్యాణీ డ్యామ్‌లో 836 అడుగుల నీటిమట్టం ఉండగా బుధవారం రాత్రికి 851 చేరింది. గురువారం సాయంత్రానికి 856 అడుగులు, శుక్రవారం రాత్రికి 860 అడుగుల వరకు చేరిందని కళ్యాణీ డ్యామ్ అధికారులు తెలిపారు.

వాగులు, వంకలు దాటేటప్పుడు జాగ్రత్తగా ఉండాలి



పాకాల పెద్దవంక ప్రవాహాన్ని పరిశీలిస్తున్న సీఐ సుదర్శన ప్రసాద్

పాకాల, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): వర్షాలు కురుస్తున్న ప్రస్తుత నేపథ్యంలో వాగులు, వంకలు దాటేటప్పుడు అప్రమత్తంగా ఉండాలని సీఐ సుదర్శన ప్రసాద్ ప్రజలకు సూచించారు. శుక్రవారం ఆయన పాకాల పెద్దవంక ప్రవాహాన్ని స్థానిక రైల్వే అండర్‌బ్రిడ్జి సమీపంలో పరిశీలించారు. చెరువుల మొరవలు రోడ్డుపై వెళ్తుంటే వాహనదారులు గమనించి దాటాలన్నారు.

డిగ్రీ కళాశాలలో ఎన్‌సీసీ క్యాడెట్ల ఎంపిక



ఎన్‌సీసీ క్యాడెట్లుగా ఎంపికైన విద్యార్థులు

పాకాల, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం ఎన్‌సీసీ క్యాడెట్లను ఎంపిక చేశారు. 29 ఆంధ్రా బెటాలియన్ తిరుపతి అధికారులు బిమ్మల్‌సింగ్, ప్రకాష్ కుమార్ ఆధ్వర్యంలో విద్యార్థులకు వివిధ పరీక్షలు నిర్వహించి 20 మందిని ఎంపిక చేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రమేష్ కుమార్, ఎన్‌సీసీ ఆఫీసర్ ఈశ్వరబాబు, రమణమ్మ పాల్గొన్నారు.

చంద్రగిరి సీఐగా సురేష్‌కుమార్ బాధ్యతల స్వీకరణ



చంద్రగిరి, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): చంద్రగిరి పోలీస్‌స్టేషన్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా సురేష్‌కుమార్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో సుబ్బరామిరెడ్డి సీఐగా ఉంటూ మూడు నెలల క్రితం తిరుపతి ట్రాఫిక్‌కు బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో భాకరాపేట సీఐ ఇమ్రాన్‌బాషా చంద్రగిరి ఇన్‌చార్జ్ సీఐగా పనిచేశారు. తాజాగా టాస్క్‌ఫోర్స్‌లో సీఐగా ఉన్న సురేష్‌కుమార్ బదిలీపై చంద్రగిరికి వచ్చారు. బాధ్యతలు తీసుకున్న తర్వాత ఆయన మాట్లాడుతూ చంద్రగిరి సర్కిల్ పరిధిలో శాంతి భద్రతల పరిరక్షణ ధ్యేయంగా పనిచేస్తానన్నారు.

కనకదుర్గమ్మ ఆలయంలో అన్నదానం గొప్ప సంకల్పం

జడ్పీ సీఈవో రవికుమార్‌నాయుడు



అన్నదానం చేస్తున్న జడ్పీ సీఈవో రవికుమార్, గ్రామస్తులు

చంద్రగిరి, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని శ్రీనివాస మంగాపురంలో వెలసిన కనక దుర్గమ్మ (వస్కోటు ఎల్లమ్మ) ఆలయంలో శ్రీనివాసమంగాపురం గ్రామస్తులు అన్నదాన కార్యక్రమం చేపట్టడం గొప్ప సంకల్పమని జడ్పీ సీఈవో రవికుమార్‌నాయుడు అన్నారు. శుక్రవారం అన్నదాన కార్య క్రమానికి ముఖ్య అతిథులుగా రవికుమార్‌నాయుడితో పాటు మాజీ ఎమ్మెల్యే మోహన్ సోదరీమణులు అంతరాజ నిర్మల, అంతరాజ కళావతి హాజరయ్యారు. గ్రామస్తులతో కలిసి అమ్మవారికి అభిషేకాలు, ప్రత్యేక పూజలు చేయించారు. అనంతరం. అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. పురాతన అమ్మవారి ఆలయాభివృద్ధికి సహాయ సహకారాలు అందిస్తానని రవికుమార్‌నాయుడు తెలిపారు. ఈ కార్యక్రమంలో గేట్ మణి, మోరపు వాసు, మబ్బు మహేష్, ఉదయగిరి కుమార్, కోలా పురుషోత్తం, బాలసుబ్రమణ్యం, సకల భాను, మాలతి, మంజుల, కంచమ్మ, పూల సురేష్ పాల్గొన్నారు.

టైలర్ ఆత్మహత్యాయత్నం



సుల్తాన్ సాహెబ్‌ను ఆస్పత్రికి తరలిస్తున్న 108 సిబ్బంది

చంద్రగిరి, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఐతేపల్లెకు చెందిన టైలర్ సుల్తాన్ సాహెబ్ ఆత్మహత్యకు యత్నించాడు. శుక్రవారం ఆయన భార్య అదే గ్రామంలోని పుట్టింటికి వెళ్లింది. తిరిగి వచ్చేసరికి అతను ఇంట్లోని ఫ్యానుకు ఉరేసుకుంటుండటం గమనించి కేకలు వేసింది. గ్రామస్తుల సహకారంతో 108 వాహనంలో తిరుపతి రుయా ఆసుపత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించి పరిస్థితి విషమంగా ఉందని తెలిపారు. ఆత్మహత్యాయత్నానికి కారణాలు తెలియాల్సి ఉంది. చంద్రగిరి పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

ఎమ్మెల్యేకు ఎల్లమ్మ ఆలయాధికారుల కృతజ్ఞతలు

చంద్రగిరి, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): చంద్రగిరిలోని మూలస్థాన ఎల్లమ్మ ఆలయ అభివృద్ధికి టీటీడీ నిధులు తెప్పించిన ఎమ్మెల్యే పులివర్తి నానికి ఆలయ చైర్మన్ మొక్కల చంద్రశేఖర్‌రెడ్డి, పాలక మండలి సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. ఆలయ అభివృద్ధికి టీటీడీ నుంచి రూ.2,50 కోట్లు మంజూరుకు ఎమ్మెల్యే కృషి చేశారని పేర్కొన్నారు. ఎమ్మెల్యేతోపాటు సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, దేవదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. నరసింగాపురం సింగిల్‌విండో చైర్మన్ రాజులగారి వినోద్‌కుమార్‌రెడ్డి, టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి కొండూరు ప్రవీణ్‌రాయల్ వేర్వేరుగా కృతజ్ఞతలు తెలిపారు.

రుణాలను సద్వినియోగం చేసుకోండి



మహిళా సంఘాలకు చెక్కు అందజేస్తున్న బ్యాంక్ అధికారులు

పాకాల, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): స్వయం సహాయక మహిళా సంఘాలు బ్యాంకుల ద్వారా తీసుకున్న రుణాలను సద్వినియోగం చేసుకోవాలని యూనియన్ బ్యాంక్ జోనల్ హెడ్ సూర్యప్రకాష్ రావు కోరారు. మండల మహిళా సమాఖ్య ఆవరణలో శుక్రవారం నిర్వహించిన గ్రామస్థాయి జనసురక్ష కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ మహిళలు స్వయం ఉపాధి రంగంలో సత్తాచాటి ఆర్థికంగా ఎదగాలన్నారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న బీమా పథకాలు, గ్రామస్థాయి జన సురక్ష, పీఎం జీవన జ్యోతి యోజన, సురక్ష బీమా యోజన, ప్రమాద బీమా, అటల్ పెన్షన్ యోజన, పీఎం జేడీవై పొదుపు, డిజిటల్ సైబర్ ఫ్రాడ్స్ గురించి మహిళా సంఘాల సభ్యులకు వివరించారు. ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన కల్పించారు. యూనియన్ బ్యాంక్ ఖాతాదారులకు అందించే సేవల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ బ్యాంక్ రీజనల్ హెడ్ సోమంచి శర్మ, డిప్యూటీ రీజనల్ హెడ్ పరశురామనాయక్, లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ జి.రవికుమార్, బ్రాంచి మేనేజర్ సి.అశోక్, వి.కీర్తన, డీఆర్‌డీఏ పీడీ శోభన్‌బాబు, ఏపీడీ ప్రభావతి, డీపీఎం వనజాక్షి, ఎంపీడీవో వాసుదేవరావు, ఏపీఎం రామమోహన్, సంఘమిత్రలు పాల్గొన్నారు.

సప్లై ఛానెల్‌ను పరిశీలించిన ఎమ్మెల్యే



అధికారులకు సూచనలిస్తున్న ఎమ్మెల్యే నాని

భాకరాపేట, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): ఎర్రావారి పాళెం మండలం రెడ్డి చెరువు నుంచి చిన్నగొట్టి గల్లు చెరువుకు ఉన్న సప్లై ఛానెల్‌ను చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని శుక్రవారం పరిశీలించారు. 2021లో వచ్చిన తుపానులకు రెడ్డి చెరువు నుంచి సప్లై ఛానెల్ గుండా నీరు గొట్టిగంటి చెరువుకు వచ్చింది. రెండు రోజుల తరువాత సప్లై ఛానెల్‌కు బోడిదేటివారిపల్లె సమీపంలో గండి పడడంతో నీళ్లు రాకుండా ఆగిపోయాయి. అప్పటి నుంచి దాన్ని బాగు చేయలేదు. ఈ విషయాన్ని ఎమ్మెల్యే దృష్టికి స్థానిక టీడీపీ నాయకులు తీసుకెళ్లగా శుక్రవారం సప్లై ఛానెల్‌కు గండి పడిన ప్రాంతాన్ని పరిశీలించారు. గండ్లను పూడ్చి గొట్టిగంటి చెరువుకు నీళ్లు వచ్చేలా చర్యలు తీసుకోవాలని ఇరిగేషన్ అధికారులను ఆయన ఆదేశించారు.

తలకోన అభివృద్ధి పనుల పరిశీలన



పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే నాని

ఎర్రావారిపాలెం, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి); తలకోన ఆలయ అభివృద్ధి పనులను చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని శుక్రవారం పరిశీలించారు. రూ.18 కోట్ల టీడీడీ నిధులతో తలకోన ఆలయాభివృద్ధి పనులు చేపట్టారు. ఆలయం ముందు నిర్మిస్తున్న కోనేరు పనులను అధికారులతో కలిసి ఎమ్మెల్యే పరిశీలించారు. యుద్ధ ప్రాతిపాదికన పూర్తి చేయాలని ఆదేశించారు. మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలకు గర్భగుడి, కోనేరు నిర్మాణాలు పూర్తి చేయాలని కాంట్రాక్టర్లను ఆదేశించారు. అనంతరం గుడికి దక్షిణ వైపుగా నిర్మిస్తున్న వసతి గదుల నిర్మాణాలను పరిశీలించి తగు సూచనలు చేశారు. తలకోన ఆలయ చైర్మన్ సోమనాథరెడ్డి, పార్టీ నాయకులు దేశిరెడ్డి రఘునాథ, ఉమామహేష్ నాయుడు, మధు, నిరంజన్ రాయల్, చిన్నపరెడ్డి, ట్రస్ట్ సభ్యులు పాల్గొన్నారు.

వర్షమొస్తే రూటు మారాల్సిందే



గుంతలతో ప్రమాదకరంగా ఉన్న రోడ్డు

పాకాల, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): వర్షం కురిస్తే పాకాల - పికొత్తకోట మార్గంలో వెళ్లే వాహనాలు రూటుమార్చుకోక తప్పడం లేదు. ఈ మార్గంలో బండపాకాల దాటాక రైల్వే అండర్ పాస్ బ్రిడ్జి నిర్మించారు. ఈ బ్రిడ్జి కింద నుంచి పోటుకనుమ - కొత్తకోటకు పాకాల నుంచి వాహనాలు వెళ్తాయి. చిన్నపాటి వర్షం కురిసినా రైల్వే అండర్ పాస్ బ్రిడ్జి కింద నీళ్లు చేరుతున్నాయి. దీంతో ఆర్టీసీ బస్సులు, ఇతర వాహనాల రాకపోకలకు ఇబ్బందిగా మారింది. చుట్టుతిరిగి తోటపల్లె మీదుగా పాకాలకు రాకపోకలు సాగించాల్సి వస్తోంది. సింగిల్ రోడ్డులో రావడానికి వాహనదారులు అవస్థలు పడుతున్నారు. మణిపిరెడ్డిపల్లె సమీపంలో రోడ్డుపై లోతైన గుంతలు ఏర్పడ్డాయి. ఈ గుంతల్లో నీళ్లు చేరడంతో లోతు తెలియక వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. శాశ్వత మరమ్మతులు చేయాలని కోరుతున్నారు.

డ్రోన్ల సాయంతో ముమ్మరంగా గాలింపు



స్వర్ణముఖి నదిలో విద్యార్థులు గల్లంతైన ప్రదేశాన్ని పరిశీలిస్తున్న ఎస్పీ



డ్రోన్‌తో వెదకుతున్న పోలీసులు

తిరుపతి(నేరవిభాగం), అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): స్వర్ణముఖి నదిలో గల్లంతైన విద్యార్థులకోసం డ్రోన్ల ద్వారా ముమ్మరంగా గాలిస్తున్నట్లు ఎస్పీ సుబ్బరాయుడు చెప్పారు. ఘటనా స్థలాన్ని ఆయన పోలీసు అధికారులతో కలసి పరిశీలించారు. ఘటనకు దారితీసిన కారణాలపై ఆరా తీశారు. అదనపు ఎస్పీ రవిమనోహరాచ్చారి, డీఎస్పీ ప్రసాద్, సీఐ సునిల్‌కుమార్, ఆర్డీవో రామ్మోహన్, రెవెన్యూ అధికారులు, ఫైర్ సిబ్బంది కలసి తక్షణం గాలింపు చర్యలు ముమ్మరం చేయాలన్నారు.

అవగాహనతోనే పోలియో తగ్గుముఖం



పోలియోపై అవగాహన కల్పిస్తున్న డాక్టర్ పునీత్

తిరుపతి (వైద్యం), అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): ప్రజలకు అవగాహన కల్పించడం వల్లే దేశంలో 99 శాతం పోలియో తగ్గుముఖం పట్టిందని స్విమ్స్ చిన్నపిల్లల విభాగాధిపతి పునీత్ అన్నారు. పుట్టిన ప్రతి బిడ్డకూ పోలియో చుక్కలు వేయించడం, అనుమానాలు ఉంటే వైద్యులను సంప్రదించడం వల్ల ఇది సాధ్యమైందన్నారు. స్విమ్స్‌లో శుక్రవారం పోలియో నివారణ దినోత్సవం నిర్వహించారు. పోలియో వ్యాధి లక్షణాలు, దాని నివారణకు ప్రభుత్వం చేపడుతున్న చర్యల గురించి ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో వైద్యులు ప్రత్యూష, భవాని, ఐశ్వర్య, అంజన్‌కుమార్, అజిత, ప్రియదర్శిని, బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

అమ్మవారి బ్రహ్మోత్సవ ఏర్పాట్ల పరిశీలన



ఏర్పాట్లను పరిశీలిస్తున్న సీవీఎస్వో మురళీకృష్ణ

తిరుచానూరు, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): వచ్చేనెల 17 నుంచి 25వ తేదీ వరకు నిర్వహించనున్న తిరుచానూరు శ్రీపద్మావతి అమ్మవారి కార్తీక బ్రహ్మోత్సవాలకు సంబం ధించిన ఏర్పాట్లను టీటీడీ ముఖ్య నిఘా భద్రతాధికారి(సీవీఎస్వో) శుక్రవారం పరిశీలించారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని ఆలయ పరిసరాల్లో హోల్డింగ్ పాయింట్, క్యూలైన్లు, మాడవీధుల్లో భక్తుల భద్రతపై విజిలెన్స్ అధికారులకు ఆయన దిశానిర్దేశం చేశారు. పంచమీతీర్థం రోజున భారీ సంఖ్యలో భక్తులు వచ్చే అవకాశముం డటంతో అందుకు తగ్గట్లుగా పార్కింగ్ స్థలాలు, క్యూలైన్ల క్రమబద్ధీకరణ వంటి వాటిపై సమీక్షించారు. భక్తులు ఇబ్బంది పడకుండా పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేపడుతున్నామని సీవీఎస్వో మురళీకృష్ణ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ డిప్యూటీ ఈవో హరీందర్‌నాథ్, ఏవీఎస్వో రాధాకృష్ణ పాల్గొన్నారు.

పెద్ద కొత్త చెరువుకు గండి



చెరువు గండిని పరిశీలిస్తున్న అధికారులు

భాకరాపేట, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): అల్పపీడన ప్రభావంతో కురుస్తున్న వర్షాలకు చెరువుల్లోకి నీరు చేరుతోంది. చిన్నగొట్టిగల్లు మండలం చిట్టేచర్ల గ్రామం నగిరి సమీపంలోని పెద్దకొత్తచెరువుకు గురువారం రాత్రి కురిసిన వర్షానికి గండి పడి నీరు వృథాగా పోతుండడంతో గమనించిన ఆయకట్టు రైతులు ఇరిగేషన్ శాఖ అధికారులకు సమాచారం ఇచ్చారు. వారు వెంటనే వచ్చి గండిని పరిశీలించి స్థానిక సర్పంచ్ నాగచెంగమ నాయుడు సహకారంతో పూడ్చి వేశారు. నీరు వృథాగా పోకుండా చర్యలు చేపట్టారు. దీంతో స్థానిక రైతులు హర్షం వ్యక్తం చేశారు.

అమ్మవారికి తిరుచ్చి ఉత్సవం



తిరుచ్చిపై ఊరేగుతున్న పద్మావతి అమ్మవారు

తిరుచానూరు, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): తిరుచానూరు పద్మావతి అమ్మవారికి శుక్రవారం రాత్రి తిరువీధి ఉత్సవం నిర్వహించారు. ఉదయం సుప్రభాత సేవతో అమ్మవారిని మేల్కొపి అర్చకులు నిత్యకైంకర్యాలు నిర్వహించారు. మూలవర్లకు సుగంధ పరిమళ ద్రవ్యాలతో నేత్రపర్వంగా అభిషేకం చేశారు. లక్ష్మీపూజ, కల్యాణోత్సవం వేడుకగా సాగింది. మధ్యాహ్నం తిరుమంజనం నిర్వహించారు. రాత్రి సర్వాలంకార శోభితురాలైన పద్మావతిదేవి బంగారు తిరుచ్చిపై కొలువుదీరి తిరుమాడ వీధుల్లో ఊరేగి భక్తులను కటాక్షించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఈవో హరీందర్‌నాథ్, ఏవీఎస్వో రాధాకృష్ణ, అర్చకులు బాబుస్వామి, సూపరింటెండెంటు రమేష్, టెంపుల్ ఇన్‌స్పెక్టర్లు ప్రసాద్, చలపతి, సుబ్బరాయుడు, సుభాస్కర్‌నాయుడు పాల్గొన్నారు.

రేషన్ డీలర్ల సమస్యలపై మంత్రికి వినతి



మంత్రికి సమస్యలు వివరిస్తున్న రేషన్ డీలర్స్ అసోసియేషన్ ప్రతినిధులు

తిరుపతి అర్బన్, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): రేషన్ డీలర్లు దీర్ఘకాలంగా ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని జిల్లా రేషన్‌డీలర్స్ అసోసియేషన్ ప్రతినిధులు కోరారు. ఈ మేరకు ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు సమక్షంలో శుక్రవారం మంత్రి నాదెండ్ల మనోహర్‌కు స్థానిక పద్మావతి అతిథిగృహంలో వినతిపత్రం అందజేశారు. కమీషన్ పెంచాలని, బాడుగలు భారమవుతున్నాయని, చౌక దుకాణాల కోసం కమ్యూనిటీ గదులు నిర్మించాలని, కందిపప్పు పంపిణీకి చర్యలు చేపట్టాలని కోరారు. మంత్రి స్పందిస్తూ వచ్చేనెల నుంచి కందిపప్పు అందిస్తామని, నగరాల్లో మినీ రేషన్ మార్టులు నిర్మిస్తామని, ఇతర సమస్యలు కూడా త్వరలోనే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు వెంకటేష్‌రెడ్డి, నగర అధ్యక్షుడు చంద్రశేఖర్‌రెడ్డి, కోటేశ్వరనాయుడు పాల్గొన్నారు.

శాప్ కోచ్‌లకు శిక్షణ



రైలులో బయలుదేరిన శాప్ కోచ్‌లు

తిరుపతి(క్రీడలు), అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ క్రీడా ప్రాధికార సంస్థ (శాప్) జిల్లా కోచ్‌లకు అప్‌గ్రేడ్‌పై మూడు రోజుల పాటు శిక్షణ ఇవ్వనున్నారు. శాప్ ఛైర్మన్ రవినాయుడు ఆధ్వర్యంలో గుంటూరులోని ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో శని, ఆది, సోమవారాల్లో ఓరియంటేషన్, కెపాసిటీ బిల్డింగ్‌పై శిక్షణ ఇవ్వనున్నారు. జిల్లా వ్యాప్తంగా ఏడుగురు కోచ్‌లు శుక్రవారం ఉదయం తిరుపతి నుంచి బయలుదేరి వెళ్లారు. మంగళవారం తిరిగిరానున్నారు.

స్విమ్స్‌లో పేదలకు ఉచిత వైద్యం అందించాలి



కాంగ్రెస్ నేతలతో కలిసి నిరసన తెలుపుతున్న చింతా మోహన్

తిరుపతి(వైద్యం), అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): స్విమ్స్‌లో పేదలకు ఉచిత వైద్యం అందించాలని కేంద్ర మాజీ మంత్రి చింతా మోహన్ డిమాండ్ చేశారు. స్థానిక టీటీడీ పరిపాలనా భవనం ఎదుట ఆయన కాంగ్రెస్ నేతలతో కలిసి శుక్రవారం నిరసన తెలిపారు. నిరుపేదలకు ఉచిత వైద్యం అందించాలనే లక్ష్యంతోనే కాంగ్రెస్ కృషితో తిరుపతిలో స్విమ్స్ ఆస్పత్రిని స్థాపించినట్లు చెప్పారు. కానీ ప్రస్తుతం అక్కడ పేదలకు ఉచిత వైద్యం అందకపోవడం బాధాకరమన్నారు. ప్రతి మంగళవారమూ స్థానికులకు ఉచిత దర్శనం కాంగ్రెస్ హయాంలో ప్రవేశపెడితే దాన్ని నిలిపేయడం మంచిది కాదన్నారు. వెంటనే పునరుద్ధరించేలా ప్రభుత్వం చర్యలు చేపట్టాలన్నారు. తిరుపతి విమానాశ్రయ ప్రైవేటీకరణ చర్యలను సీఎం చంద్రబాబు అడ్డుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నేతలు గోపీగౌడ్, రవి, శాంతి, తేజోవతి పాల్గొన్నారు.

నిరంతర తనిఖీలు లేకపోవడంతోనే ప్రమాదం

తిరుపతి(జీవకోన), అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): ప్రైవేటు బస్సులపై నిరంతర తనిఖీలు లేకపోవడంతోనే ఇటువంటి ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని బీజేపీ నేత నవీన్‌కుమార్‌రెడ్డి అన్నారు. కర్నూలు వద్ద జరిగిన ప్రమాదంలో దాదాపు 20మంది ప్రాణాలు కోల్పోవడం బాధాకరమన్నారు. రవాణా శాఖ నిర్లక్ష్యం కారణంగా ప్రైవేటు ట్రావెల్స్ బస్సులు ప్రయాణికుల పాలిట శాపంగా మారుతున్నాయని విమర్శించారు. గతంలో అధికారులు మాన్యువల్‌గా పరీక్షించి సర్టిఫికెట్లు ఇచ్చేవారని, ప్రస్తుతం ఆన్‌లైన్ విధానం రావడంతో ఇలాంటి తప్పిదాలు జరుగుతున్నాయని తెలిపారు. ప్రభుత్వం స్పందించి కఠినమైన నిర్ణయాలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని శుక్రవారం విడుదల చేసిన ప్రకటనలో కోరారు.

జానపద కళాకారులకు గుర్తింపు కార్డులివ్వాలి

తిరుపతి(ఆటోనగర్), అక్టోబరు24(ఆంధ్రజ్యోతి): గ్రామీణ జానపద కళాకారులకు ప్రభుత్వం గుర్తింపు కార్డులు ఇచ్చి, సంక్షేమ పథకాలు వర్తింపజేయాలని ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్య మండలి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సి.పెంచలయ్య డిమాండ్ చేశారు. స్థానిక బైరాగిపట్టెడలోని సీపీఐ కార్యాలయ ప్రాంగణంలో శుక్రవారం గ్రామీణ జానపద ఆధ్యాత్మిక కళాకారుల సంఘం గురువుల సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన పెంచలయ్య మాట్లాడుతూ అంతరించిపోతున్న గ్రామీణ జానపదాలను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉందన్నారు. డప్పు, డోలు, నవరంజమేళం, చెక్కభజనలు, కులుకు భజన కోలాటాలు, వీధి బాగోతం, బుర్రకథలు నిర్వహిస్తున్న కళాకారులకు గుర్తింపు కార్డులు ఇవ్వాలని కోరారు. కళాకారుల సమస్యలు తెలిసిన డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ దీనిపై స్పందించాలన్నారు. శ్రీకాళహస్తి, కాణిపాకం దేవస్థానాల్లో జరిగే ఉత్సవాలకు తిరుపతి జిల్లాకు చెందిన భజన కళాకారులకు అవకాశం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సంఘం నాయకులు ముకుందయ్య, నాగభూషణం, ఫ్లూట్ సుబ్బు, మునిరాజ పాల్గొన్నారు.

మంత్రి నాదెండ్లకు సన్మానం



తిరుపతి(జీవకోన), అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): తిరుపతి పర్యటన నిమిత్తం వచ్చిన రాష్ట్ర మంత్రి నాదెండ్ల మనోహర్‌ను స్థానిక పద్మావతి అతిథిగృహంలో ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, డిప్యూటీ మేయర్లు ఆర్సీ మునికృష్ణ, ముద్రనారాయణ, కార్పొరేటర్ ఎస్‌కే బాబు మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయనను దుశ్శాలువతో సత్కరించారు.

కాళంగి జలాశయం 8 గేట్లు ఎత్తివేత



కేవీబీపురం, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): మండలంలోని కాళంగి జలాశయం గురువారం రాత్రి కురిసిన వర్షంతో నీటి మట్టం పెరగడంతో అధికారులు 8 గేట్లను ఎత్తివేసి దిగువకు నీటిని విడుదల చేశారు. శుక్రవారం నీటిమట్టం 219 అడుగులకు చేరడంతో 217 అడుగుల వరకు తగ్గిస్తున్నారు. ప్రధాన మూడు గేట్లను తెరవలేదు. పక్కనున్న 18 గేట్లలో ఎనిమిది గేట్లను మాత్రమే ఎత్తినట్లు ఏఈ బాబు తెలిపారు.

తిరుపతి

రెండు బస్సుల ఢీ

పలువురికి గాయాలు

తిరుచానూరు, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): తిరుచానూరు పంచాయతీ దామినేడు ఇందిరమ్మ ఇళ్ల వద్ద శుక్రవారం రెండు బస్సులు ఢీకొన్నాయి. ఈ క్రమంలో పలువురు గాయపడ్డారు. పుత్తూరు డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు తిరుపతికి వెళుతుండగా దామినేడు వద్ద ముందు టైరు పంక్చరైంది. రోడ్డు సైడు ఆపి ఉండగా డ్రైవర్ పంక్చర్ వేస్తున్నాడు. అదే సమయంలో సత్యవేడు నుంచి వస్తున్న మరో ఆర్టీసీ బస్సు దాన్ని వెనుక నుంచి ఢీకొట్టింది. ఈ ఘటనలో ఎనిమిది మంది స్వల్పంగా, ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను తిరుపతి రుయా ఆస్పత్రికి తరలించారు. తిరుచానూరు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

తిరుపతి బాలోత్సవం వాయిదా

తిరుపతి(ఆటోనగర్), అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): ఈనెల 25, 26 తేదీల్లో నిర్వహించాల్సిన తిరుపతి బాలోత్సవాన్ని అనివార్య కారణాల వల్ల వాయిదా వేసినట్లు నిర్వాకులు మల్లారపు నాగార్జున తెలిపారు. నవంబరు 1, 2 తేదీల్లో నిర్వహిస్తామని, ఈ మార్పును గమనించి సహకరించాలని కోరారు.

27న నారద పుష్కరిణిలో కార్తీక దీపోత్సవం

శ్రీకాళహస్తి, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): కార్తీక మాసాన్ని పురస్కరించుకుని శ్రీకాళహస్తీశ్వరాలయ ఆధ్వర్యంలో ఈనెల 27న సోమవారం పట్టణంలోని నారద పుష్క రిణిలో కార్తీక దీపోత్సవం నిర్వహించను న్నట్లు ఈవో తెలిపారు. నవంబరు 3న వైష్ణవ కోనేరులో, 10న భరద్వాజ తీర్థంలో సాయంత్రం 6గంటల సమయంలో కార్తీక దీపోత్సవం జరుగుతుందన్నారు.

నేత్రపర్వంగా ఆకాశదీపం



శ్రీకాళహస్తి, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): జ్ఞానప్రసూ నాంబ సమేత శ్రీకా ళహస్తీ శ్వరాల యంలో శు క్ర వారం ఆకాశ దీపాన్ని కన్నుల పండుగగా వెలి గించారు. వాయులింగేశ్వరుడి క్షేత్రంలో కార్తీక మాసాన్ని పురస్కరించుకుని ప్రతి రోజు ఆకాశదీపాన్ని వెలిగిస్తుంటారు. ఇందులో భాగంగా ఆలయ వేదపండితులు ఊంజల్ మండపం వద్ద కార్తీక దీపానికి పూ జలు చేశారు. అనంతరం స్థూపానికి జ్యోతిని అమర్చి ఆకాశదీపంగా ఎగురవేశారు. భక్తులు విశేషంగా ఆకాశ దీపాన్ని దర్శించుకున్నారు.

అలరించిన నృత్య ప్రదర్శన



శ్రీకాళహస్తి, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయంలోని బ్రహ్మగుడి వద్ద కార్తీక మాసాన్ని పురస్కరించుకుని సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా శ్రీకాళహస్తి పట్టణంలోని శివాజ్ఞ శివాని నాట్యాలయానికి చెందిన కళాకారుల నృత్య ప్రదర్శన అలరించింది. పలు శివనామ కీర్తనలకు వారు నృత్యం చేశారు. అనంతరం వారికి ఆలయ అధికారులు జ్ఞాపికలు, ప్రశంసాపత్రాలు అందజేశారు.

గ్రూపు రాజకీయాలు చేస్తే పార్టీ సహించదు

● ఒకటి నుంచి డోర్ టూ డోర్ క్యాంపెయిన్ ● జన సైనికులకు మంత్రి నాదెండ్ల దిశానిర్దేశం

తిరుపతి అర్బన్, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): గ్రూపు రాజకీయాలు చేస్తే జనసేన పార్టీ సహించదని మంత్రి నాదెండ్ల మనోహర్ హెచ్చరించారు. జిల్లా పర్యటనకు వచ్చిన ఆయన శుక్రవారం మధ్యాహ్నం పద్మావతి గెస్ట్‌హౌస్‌లో ఉమ్మడి చిత్తూరు జిల్లా నాయకులు, కార్యకర్తలతో సమావేశమయ్యారు. వ్యక్తిగత కారణాలతో ఆధిపత్యం ప్రదర్శిస్తూ పార్టీకి చెడ్డపేరు తీసుకురావద్దన్నారు. పార్టీలో అందరూ సమానమేనని, ఒకరిపై ఒకరు ఆరోపణలు, విమర్శలు చేసుకోవడం సరికాదని హితవు పలికారు. పార్టీ ఆదేశమే శిరోధార్యంగా భావించాలన్నారు. కష్టపడి పనిచేసే వారికి పార్టీ అండగా ఉంటుందన్నారు. అందుకు నిదర్శనం శ్రీకాళహస్తి దేవస్థానం ఛైర్మన్‌గా నియమితులైన కొట్టె సాయి అని గుర్తు చేశారు. నిత్యం ప్రజల్లో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలన్నారు. నవంబరు ఒకటో తేదీ నుంచి డోర్ టూ డోర్ క్యాంపెయిన్ నిర్వహించాలని ఆదేశించారు. ఎన్డీయే ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని, అర్హులై ఉండి రాని వారిని గుర్తించాలని దిశానిర్దేశం చేశారు.

రేషన్ డిజిటల్ కార్డులతో అక్రమ రవాణాను అరికట్టాం

రేషన్ డిజిటల్ కార్డులతో సరుకుల అక్రమ రవాణాను పూర్తిగా అరికట్టామని మంత్రి నాదెండ్ల మనోహర్ అన్నారు. పద్మావతి అతిథిగృహంలో పార్టీ నేతల సమావేశం అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. అక్రమాలకు పాల్పడుతున్న వారిని ఏరివేయడమే ఎన్డీయే ప్రభుత్వ లక్ష్యమన్నారు. ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌ను ఎవరైనా కలిసి కష్టాలు చెప్పుకోవచ్చని పార్టీ శ్రీకాళహస్తి ఇన్‌చార్జి వినుత విషయమై మీడియా అడిగిన ఒక ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. శ్రీకాళహస్తి ఆలయ ఛైర్మన్ సాయిపై వచ్చిన ఆరోపణలలో వాస్తవం లేదని కొట్టిపారేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, ఉమ్మడి జిల్లా జనసేన అధ్యక్షుడు పసుపులేని హరిప్రసాద్, కోడూరు ఎమ్మెల్యే శ్రీధర్, సీనియర్ నేత కిరణ్‌రాయల్, తిరుపతి నగరాధ్యక్షుడు రాజారెడ్డి, కార్పొరేటర్లు, ఇతర నాయకులు పాల్గొన్నారు.

తిరుమలలో మంత్రి నాదెండ్ల



తిరుమలలో మంత్రికి స్వాగతం పలుకుతున్న సత్రేనాయక్

తిరుమల, అక్టోబరు24 (ఆంధ్రజ్యోతి): మంత్రి నాదెండ్ల మనోహర్ శ్రీవారి దర్శనార్థం శుక్రవారం తిరుమలకు వచ్చారు. తిరుమలలోని ఫీనిక్స్ గెస్ట్ హౌస్‌కు చేరుకున్న ఆయనకు టీటీడీ రిసెప్షన్ ఓఎస్డీ సత్రేనాయక్ స్వాగతం పలికి బస, దర్శన ఏర్పాట్లు చేశారు. శనివారం ఉదయం ఆయన శ్రీవారిని దర్శించుకోనున్నారు.

ఆర్టీసీ కండక్టర్ సస్పెన్షన్

తిరుపతి(ఆర్టీసీ), అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): తిరుమల బస్సు టిక్కెట్ల జారీలో గోల్‌మాల్ చేశారని ఆర్టీసీ అధకారులు ఓ కండక్టర్‌ను సస్పెండు చేశారు. అలిపిరి డిపోకు చెందిన మహిళా కండక్టర్ లుథియానా గత నెల 22న తిరుమలలో డిస్పాచ్ విధులు నిర్వహించారు. ఈ క్రమంలో ఎలక్ట్రిక్ బస్సులో ఇద్దరు ప్రయాణికుల నుంచి నగదు తీసుకున్నారు. ఒక టిక్కెటే ఇచ్చారు. మొత్తం 18మంది లెక్కించి బస్సును డిస్పాచ్ చేశారు. మార్గమధ్యంలో స్క్వాడ్ తనిఖీ చేయగా ఇద్దరు ప్రయాణికుల వద్ద ఒక టిక్కెట్ మాత్రమే ఉంది. దీనిపై ఆరా తీయా తన వద్ద పొరపాటు జరిగిందని కండక్టర్ అంగీకరించినట్లు తెలిసింది. దీనిపై ఉన్నతాధికారులకు నివేదిక పంపారు. ఈ క్రమంలో ఆమెను సస్పెండు చేస్తూ ఆదేశాలు జారీచేశారు. సస్పెండు నిర్ణయాన్ని ఆపేయాలని, పనిస్మెంట్ ఇవ్వాలని శుక్రవారం ఎన్ఎంయూ ప్రతినిధులు డిమాండ్ చేశారు. అలా కుదరదని డిపో మేనేజర్ హరిబాబు చెప్పడంతో వారు డిపో ముందు సస్పెండైన కండక్టర్‌తో కలిసి నిరసన తెలిపారు. డీఎంకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు.

నిబంధనలు పాటించని బస్సులపై చర్యలు



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్టీవో మురళీమోహన్

తిరుపతి(జీవకోన), అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): నిబంధనలు పాటించని ప్రైవేటు బస్సుల పట్ల కఠినంగా వ్యవహరించాలని జిల్లా రవాణాశాఖాధికారి మురళీమోహన్ అన్నారు. శుక్రవారం జిల్లా రవాణా శాఖ అధికారి కార్యాలయంలో ఎంవీఐలతో రహదారి ప్రమాదాలపై సమక్షించారు. ఆయన మాట్లాడుతూ ఈ ఏడాది జనవరి నుంచి ఇప్పటి వరకు కాంట్రాక్టు క్యారేజీ బస్సులపై 565 కేసులు నమోదు చేసి, రూ.42,95,331 అపరాధ రుసుం వసూలు చేసినట్లు చెప్పారు. పన్ను చెల్లించని, పర్మిట్ లేకుండా సరుకు రవాణా చేస్తున్న వాహనాలపై ఎక్కువ కేసులు నమోదు చేశామన్నారు. కర్నూలు జిల్లాలో జరిగిన బస్సు ప్రమాదంపైనా సమీక్షించారు. వాహన తనిఖీలను మరింత కఠితరం చేయాలని ఆదేశించారు. మద్యం తాగి వాహనం నడుపుతున్న డ్రైవర్లపై దృష్టి సారించాలన్నారు. కండిషన్ సరిగా లేకపోయినా, వాహన సామర్థ్య ధృవీకరణ పత్రానికి సబంధించి లోపాలు ఉన్నా తక్షణమే చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో ఎంవీఐలు సుబ్రహ్మణ్యం, దామోదర్‌నాయుడు, మోహన్‌కుమార్, ఆంజనేయప్రసాద్, వెంకటరమణనాయక్, స్వర్ణలత పాల్గొన్నారు.

మల్లిమడుగు డ్యాం గేట్ల మూసివేత



రేణిగుంట, అక్టోబరు 24 (ఆంధ్రజ్యో తి): మండలంలోని మల్లిమడుగు డ్యాం 2 గేట్లను శుక్రవారం మధ్యాహ్నం మూసి వేశారు. మూడు రోజులుగా కురు స్తున్న వర్షాలకు శేషాచలం అటవీ ప్రాంతాల నుంచి వచ్చే వర్షపు నీటితో గురువారం తెల్లవారుజామున డ్యాం నిండడంతో 10 గేట్లను ఒక అడుగు ఎత్తి నీటిని దిగువకు వదిలిన విషయం విదితమే. ఈక్రమంలో శుక్రవారం వర్షం తగ్గుముఖం పట్టడంతో రెండు గేట్లను మూసివేసి ఒక్క అడుగు ఎత్తి 8 గేట్ల ద్వారా నీటిని కిందకు విడుదల చేస్తున్నారు. ప్రస్తుతానికి 500 క్యూసెక్కుల నీరు డ్యాంలోకి చేరుతుండగా, అంతే పరిమాణంలో దిగువకు విడుదల చేస్తున్నామని డీఈఈ చంద్రమౌళి తెలిపారు.

ఆధార్ కేంద్రంలో అధిక వసూళ్లు

సిబ్బంది తీరుపై బ్యాంకు మేనేజరుకు ఫిర్యాదు

శ్రీకాళహస్తి, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఆధార్ సేవా కేంద్రాల్లో ధరల పట్టికను పాటించడంలేదన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. శుక్రవారం పట్టణంలోని ఓ బ్యాంకులో ఉచిత సేవకు రూ.వంద ముకుపిండి వసూలు చేయడంపై ఆధార్ పొందిన పౌరుడు రసీదు ఇవ్వాలని డిమాండ్ చేశాడు. సిబ్బంది నీళ్లు నమలడంతో బ్యాంకు మేనేజరుకు ఫిర్యాదు చేశాడు. శుక్రవారం పట్టణానికి చెందిన వ్యక్తి ఆరేళ్ల తమ పాపకు ఆధార్‌లో వేలిముద్రలను నమోదు చేసేందుకు జయరామరావువీధిలోని ఓ బ్యాంకు వద్దకు వెళ్లాడు. పాపకు మ్యాండేటరీ విభాగంలో ఉచిత సేవ పూర్తయిన తరువాత అక్కడి సిబ్బంది రూ.100ను డిమాండ్ చేశారు. ఆ మేరకు రూ.100 చెల్లించిన వ్యక్తి తనకు రసీదును ఇవ్వాలని కోరారు. దాంతో నీళ్లు నమిలిన సిబ్బంది రూ.100ను తిరిగి ఇచ్చి అక్కడ ఉన్న వారి నుంచి తిరుగుబాటు రాకుండా పరిస్థితిని సర్దుబాటు చేశారు.

ఆలయ అభివృద్ధికి సమన్వయంతో ముందుకెళ్తాం

పళ్లికొండేశ్వరాలయ ట్రస్టు బోర్డు ఛైర్మన్ పద్మనాభరాజు

నాగలాపురం, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): సురుటుపల్లి పళ్లికొండేశ్వర ఆలయ అభివృద్ధితో పాటు తనకు ఈ పదవి రావడానికి కారకులైన టీడీపీ శ్రేణుల సంక్షేమం, పార్టీ ఐక్యత కోసం సమన్వయంతో ముందుకెళ్తానని ఆలయ పాలకమండలి ఛైర్మన్ పద్మనాభరాజు తెలిపారు. శుక్రవారం ఉదయం స్వామిసేవలో పాల్గొన్న అనంతరం మీడియాతో ఆయన మాట్లాడారు. శివేచ్ఛతో తనకు ఈ పదవి దక్కిందని, అయితే దీనిపై కొందరు లేనిపోని రాద్ధాంతం సృష్టిస్తున్నారని వాపోయారు. తాను పార్టీకి విధేయుడిగా ఉంటూ, తన భార్య మధుబాల పిచ్చాటూరు ఎంపీపీగా ఉన్న రోజుల్లో ప్రజాసేవే లక్ష్యంగా పని చేశానన్నారు. ఏ రోజు తన మీద అవినీతి అంటిన దాఖలాలు లేవన్నారు. తుఫాను కారణంగా ఆలయం వద్ద జరగాల్సిన ఆత్మీయ సమావేశం వాయిదా పడిందన్నారు. నిందలు మోపడం సులభమే కానీ కర్మఫలం ఎవరిని వదలదన్నారు. వ్యాపారం చేయడం తన వృత్తి అని, అది తప్పు అని ఏ రాజ్యాంగంలో లేదన్నారు. ఆరోపణలు చేసేవారు ఇది తెలుసుకుంటే మంచిదన్నారు. కోర్టులు, కేసులు తనకు కొత్త కాదని తాను ఏ తప్పు చేయలదన్నారు. పాలక మండలిసభ్యులు హంస రుద్రయ్య, నెల్సన్ మండేలా, కవిత పాల్గొన్నారు.

పళ్లికొండేశ్వరాలయానికి బంగారు మాంగల్యం వితరణ



నాగలాపురం, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సురుటుపల్లి పళ్లికొండేశ్వర ఆలయానికి హైదరాబాద్‌కి చెందిన డాక్టర్ సెంథిల్‌కుమార్ కుటుంబ సభ్యులు రూ.2.16లక్షల విలువైన బంగారు మాంగళ్యాన్ని వితరణ చేశారు. శుక్రవారం ఆలయ ఛైర్మన్ కార్యాలయంలో ఛైర్మన్ పద్మనాభరాజుకి అందించారు. దాత కుటుంబ సభ్యులకు ప్రత్యేక దర్శన ఏర్పాట్లు కల్పించారు. ఈ కార్యక్రమంలో బోర్డు సభ్యులు హంస రుద్రయ్య, నెల్సన్ మండేలా, కవిత తదితరులు పాల్గొన్నారు.

అమ్మవారి విగ్రహం ధ్వంసం చేసిన యువకుడి అరెస్ట్

రేణిగుంట, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): మద్యంమత్తులో అమ్మవారి విగ్రహాన్ని ధ్వంసం చేసిన యువకుడిని అరెస్టు చేసినట్లు ఏఎస్పీ రవి మనోహర్ ఆచారి తెలిపారు. తూకివాకం పంచాయతీ ఎస్ఎన్‌పురంలో రోడ్డు పక్కన బాట గంగమ్మ ఆలయంలో అమ్మవారి విగ్రహాన్ని నవీన్ గురువారం ధ్వంసం చేసిన విషయం విదితమే. ఈ క్రమంలో నవీన్‌ను అరెస్ట్ చేసినట్లు ఏఎస్పీ తెలిపారు.





జస్టిస్ సునీల్ చౌదరి



రఘురామకృష్ణమరాజు



సావిత్ర ఠాకూర్



విజయభారతి సాయని



అరవింద్ సింగ్



జస్టిస్ రాజశేఖర్‌రెడ్డి



మనోజ్ శశిధర్




అశ్విని

శ్రీవారి సేవలో ప్రముఖులు

తిరుమల, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారిని శుక్రవారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. వారిలో.. ఏపీ హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ సునీల్ చౌదరి, జస్టిస్ శ్యామ్ ప్రసాద్, డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణమరాజు, కేంద్ర మహిళా శిశు శాఖ మంత్రి సావిత్ర ఠాకూర్, కేంద్ర జల శక్తి డైరెక్టర్ హరి నారాయణన్,జాతీయ మానవ హక్కుల కమిషన్ సభ్యురాలు విజయభారతి సాయని,గ్రేటర్ హైదరాబాద్ మాజీ మేయర్ రామ్మోహన్,ఇండియన్ ఆయిల్ చైర్మన్ అరవింద్ సింగ్, సీబీఐ డైరెక్టర్ మనోజ్ శశిధర్, తెలంగాణ లోకాయుక్త జస్టిస్ రాజశేఖర్‌రెడ్డి, నటి అశ్విని ఉన్నారు.

శ్రీవారి సర్వదర్శనానికి 12 గంటలు



తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 12 గంటల సమయం పడుతోంది. శుక్రవారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లో 31 కంపార్టుమెంట్లు, నారాయణగిరిలో తొమ్మిదిషెడ్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 6 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

బుధవారం హుండీ ఆదాయం: రూ.3.33 కోట్లు

గురువారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు : 60,896

తలనీలాలు సమర్పించినవారు: 23,077

ఎస్పీడీసీఎల్‌లో అక్రమాదాయం రూ. 50వేల కోట్లు

● తిరుపతి కేంద్రంగా భారీ అవినీతి ● ప్రజలు చైతన్యం కావాలి ● రౌండ్ టేబుల్ సమావేశంలో ఏబీ వెంకటేశ్వరరావు పిలుపు

తిరుపతి(విద్య/ఆటోనగర్), అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): 'తిరుపతి కేంద్రంగా ఏపీ ఎస్పీడీసీఎల్‌లో భారీ అవినీతి జరుగుతోంది. ఏటా ఇక్కడి అక్రమాదాయం రూ.50 వేల కోట్లు' అని ఇంటెలిజెన్స్ మాజీ డీజీ ఏబీ వెంకటేశ్వరరావు సంచలన వ్యాఖ్యలు చేశారు. విద్యుత్ రంగంలో అవినీతిపై సెంటర్ ఫర్ లిబర్టీ ఆధ్వర్యంలో శుక్రవారం తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన రౌండ్‌టేబుల్ సమావేశంలో ఆయన మాట్లాడారు. 'రాయలసీమలోని 11 లక్షల వ్యవసాయ కనెక్షన్లకు రూ.1200 కోట్లతో అలైడ్ ఎక్విప్‌మెంట్ డబ్బు చెల్లించారు. ఎక్కడా ఒక మీటరు కూడా అమర్చలేదు. ఇతర రాష్ట్రాల్లో మీటరుకు రూ.6-7 వేలు చెల్లిస్తే, మన రాష్ట్రంలో రూ.33 వేల వంతున ఇచ్చారు. ఇక, ఆర్‌డీఎస్ఎస్ కింద 26 వేల ట్రాన్స్‌ఫార్మర్లు ఆర్డరు చేస్తే సరఫరా అయింది ఆరు వేలే. మిగిలిన 20 వేల ట్రాన్స్‌ఫార్మర్లు రెండున్నరేళ్లుగా షిరిడీసాయి ఎలక్ట్రికల్స్ గోడౌన్లలోనే ఉన్నట్టు రికార్డులు చూపిస్తున్నాయి. 2018 టీడీపీ ప్రభుత్వంలో విద్యుత్ పరికరాల కొనుగోలుకు జరిగిన టెండర్-65 ద్వారా 7 కంపెనీలు అర్హత సాధించాయి.వాటిలో తోషిబా,షిరిడీసాయి ప్రధానంగా ఉన్నాయి. 2023లో వైసీపీ ప్రభుత్వంలో టెండర్-34 ద్వారా 8 కంపెనీలు బిడ్లు వేస్తే కేవలం షిరిడీసాయి, తోషిబా మాత్రమే అర్హత సాధించడం గమనార్హం. ప్రస్తుతం కూటమి ప్రభుత్వంలోకూడా ఈరెండు కంపెనీలకే కాంట్రాక్టులు ఇస్తున్నారు. అందులోనూ షిరిడీసాయి కంపెనీకే 80-95 శాతం ఉంది. జగన్ ప్రభుత్వం ప్రారంభించిన ఈ దోపిడీని ప్రస్తుత ప్రభుత్వం కొనసాగిస్తోంది. విద్యుత్ మాఫియాను అడ్డుకునే శక్తి ఈ ప్రభుత్వానికి ఉందా లేదా? ఇలా రూ.వేల కోట్ల అవినీతితో బిల్లుల పేరిట ప్రజల నడ్డి విరుస్తున్నారు. ప్రజలు చైతన్యవంతులై ప్రశ్నించాలని, పోరాడాలి' అని ఏబీవీ పిలుపునిచ్చారు. అంతకుముందు సెంటర్ ఫర్ లిబర్టీ వ్యవస్థాపకుడు నలమోతు చక్రవర్తి ఇదే విషయాలను వాటికి సంబంధించిన రికార్డులను పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. విద్యుత్ అవినీతికి వ్యతిరేకంగా ప్రజలు పోరాడేందుకు ఎలా ముందుకు వెళ్లాలో కార్యాచరణ రూపొందిస్తామన్నారు. విద్యుత్తు సంస్థల్లో అవినీతి నిగ్గు తేల్చాలని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఎ.రామానాయుడు డిమాండు చేశారు. ఇది లిక్కర్ స్కాం కంటే పెద్దదని సీఐటీయూ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కందారపు మురళి పేర్కొన్నారు. ఈ అవినీతిపై ప్రజాక్షేత్రంలో చర్చ జరగాలని ఐఎఫ్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి రాయపనేని హరికృష్ణ సూచించారు. అవినీతికి బలవుతున్నది దళితులు, బహుజనులేనని ఆర్పీఐ దక్షిణ భారతదేశ అధ్యక్షుడు పి.అంజయ్య పేర్కొన్నారు. చార్జీలపెంపు, అవినీతిపై అవగాహన పెరగాలని తిరుపతి ఛాంబర్ ఆఫ్ కామర్స్ నేత కె.మోహన్ కుమార్ రాజు అన్నారు. ఈ తరహా అవినీతిని అరికట్టడానికి ప్రజా ఉద్యమం రావాలని బహుజన సమాజ్‌వాది పార్టీ నేత పేరం సత్యం అభిప్రాయపడ్డారు. విద్యుత్ సంస్థలో అవినీతిపై లోతుగా విచారణ జరగాలని విశ్రాంత ఎస్ఈ దేవేంద్రరెడ్డి అన్నారు. పాలకుల వల్లే అవినీతి పెరుగుతోందని లోక్‌సత్తా పార్టీ నేత రామారావు ఆరోపించారు. ఈ కార్యక్రమంలో వివిధ పార్టీల నేతలతో పాటు లిబర్టీ ఆఫ్ ఇండియా ప్రతినిధులు అక్కినేని భవానీప్రసాద్, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న ఏబీ వెంకటేశ్వరరావు, సెంటర్ ఫర్ లిబర్టీ ప్రతినిధులు, నేతలు



పట్టుబడిన నాగుపాము

అమ్మో.. 9 అడుగుల నాగుపాము

తిరుమల, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): అలిపిరి కాలిబాటలోని ఎన్ఎస్ టెంపుల్ వద్ద సుమారు తొమ్మిది అడుగుల పొడవైన నాగుపాము శుక్రవారం ఓ దుకాణంలోకి ప్రవేశించింది. దీనిని గుర్తించిన స్థానికులు వెంటనే పాములు పట్టే టీటీడీ కాంట్రాక్ట్ ఉద్యోగి భాస్కర్‌నాయుడికి సమాచారమిచ్చారు. ఆయన పామును పట్టుకుని అవ్వాచారి కోనలో విడిచిపెట్టారు.

డ్రంకెన్ డ్రైవ్ కేసులో 24 మందికి జరిమానా

తిరుపతి(నేరవిభాగం), అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): మద్యం తాగి వాహనాలు నడిపిన కేసులో 24 మందికి జరిమానా విధిస్తూ తిరుపతి మూడవ అదనపు జిల్లా న్యాయమూర్తి సంధ్యారాణి శుక్రవారం తీర్పు చెప్పారు. ఒక్కొక్కరికి రూ.10వేలు చొప్పున మొత్తం 2.40 లక్షల రూపయాలను జరిమానాగా విధించారు.

చర్చంతా 'గ్రేటర్ తిరుపతి'పైనే

● సీఎం చంద్రబాబు గొప్ప ఆలోచనతో ప్రతిపాదన చేశారన్న ఆరణి ● ఏకగ్రీవంగా ఆమోదించిన కౌన్సిల్

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): ఎస్వీయూనివర్సిటీ సెనేట్ హాలులో శుక్రవారం తిరుపతి నగర పాలక సంస్థ కౌన్సిల్ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ప్రధాన చర్చంతా గ్రేటర్ తిరుపతి పైనే జరిగింది. మొత్తం 108 అంశాలను కౌన్సిల్‌లో అజెండాగా ఉంచినట్టు మేయర్ శిరీష ప్రకటించారు. ఇందులో 100వ అంశంగా గ్రేటర్ తిరుపతి తీర్మానం ఉన్నట్టు తెలిపారు. గ్రేటర్ తిరుపతి తీర్మానాన్ని ఒకటిగా ప్రవేశపెట్టాలని కార్పొరేటర్లు పట్టుబట్టారు. కాగా, ప్రస్తుతం యథాతదంగా తిరుపతి ఉంటే ట్రాఫిక్ సమస్యలు విపరీతంగా ఉన్నాయని మేయర్ శిరీష అన్నారు. టీటీడీ సత్రాలు, బస్టాండు, రైల్వే స్టేషన్ అన్నీ ఒకే చోట ఉండటంతో ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తుతున్నాయన్నారు. రోడ్లు విస్తరించాలంటే కూడా ఎన్నో సమస్యలు ఉన్నాయన్నారు. ఈ పరిస్థితుల్లో మెట్రో పాలిటన్ సిటీగా తిరుపతి మారితే అభివృద్ధి చెందడానికి అవకాశం ఏర్పడుతుందన్నారు. సీఎం నారా చంద్రబాబు నాయుడు గొప్ప ఆలోచనతో గ్రేటర్ తిరుపతి ప్రతిపాదన చేశారని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు అన్నారు. గ్రేటర్ తిరుపతి ఏర్పాటులో భాగంగా సమీప నియోజకవర్గాలు, మండల, గ్రామ పంచాయతీలకు సంబంధించి కొన్ని రోజులు చర్చించి నిర్ణయం తీసుకుందామని కోరారు. తనతో పాటు గ్రేటర్ తిరుపతి ఏర్పాటు పట్ల ఎవరికీ అభ్యంతరం లేదని స్పష్టం చేశారు. గ్రేటర్ తిరుపతిలో భాగంగా నగర విస్తరణకు ప్రాధాన్యం ఇవ్వాలని ఎంపీ గురుమూర్తి కోరారు. తిరుపతికి అధిక నిధులు రాబట్టేందుకు ప్రయత్నం జరగాలని ఎమ్మెల్సీ సిపాయి సుబ్రమణ్యం సూచించారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో గ్రేటర్ తిరుపతి ఆలోచన చేయలేదని, ప్రస్తుతం ఈ దిశగా ఆలోచించిన సీఎం చంద్రబాబుకు కౌన్సిల్ పక్షాన కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు డిప్యూటీ మేయర్ ఆర్సీ మునికృష్ణ చెప్పారు. కాగా, గ్రేటర్ తిరుపతి ప్రతిపాదనకు సభ్యులంతా ఏకగ్రీవంగా ఆమోదం తెలిపారు. మిగతా 107 ప్రతిపాదనలపై చర్చించకుండానే ఆమోదించారు. తుడా వీసీగా, జేసీగా అదనపు బాధ్యతలు స్వీకరించినందుకు కమిషనరు మౌర్యను కౌన్సిల్ అభినందించింది. సమావేశానికి ముందు కార్పొరేటర్ అన్నా సంధ్యా భర్త, కుమార్తై మృతి పట్ల కౌన్సిల్ సంతాపాన్ని వ్యక్తం చేసింది.



తిరుపతి కార్పొరేషన్ కౌన్సిల్ మీట్‌లో కార్పొరేటర్ గణేష్‌ను నెట్టివేసిన ఎస్‌కే బాబు అనుచరుడు

ఘటనపై కేసు నమోదు

తిరుపతి(నేరవిభాగం), అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): కౌన్సిల్ సమావేశంలో జరిగిన ఘటనపై కార్పొరేటర్ ఎస్‌కేబాబు అన్న కుమారుడు మహ్మద్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్వీయూ పోలీసు స్టేషన్ సీఐ రామయ్య శుక్రవారం తెలిపారు. మున్సిపల్ కార్యాలయ రెవెన్యూ అధికారి సేతుమాధవ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు.

కౌన్సిల్ మీట్‌లో ఘర్షణ

గ్రేటర్ తిరుపతి తీర్మానంపై చర్చ సాగుతున్న సమయంలో ఇద్దరు కార్పొరేటర్ల మధ్య వాగ్వాదం జరిగింది. జనసేన కార్పొరేటర్ ఎస్‌కే బాబు చర్చలో తన అభిప్రాయాన్ని వ్యక్తం చేస్తున్న సమయంలో.. వైసీపీ కార్పొరేటర్ గణేష్ జోక్యం చేసుకున్నారు. గత వైసీపీ ప్రభుత్వం గ్రేటర్ తిరుపతి ప్రతిపాదన తీసుకురాలేదనీ, మంచి ఉద్దేశంతో కూటమి ప్రభుత్వం తీసుకొచ్చిందని ఎస్‌కే బాబు స్పష్టంచేశారు. గ్రేటర్ తిరుపతి జరిగితే భూ వ్యాపారం చేద్దామనా అంటూ ఆయన్ను గణేష్ హేళనగా మాట్లాడారు. దీంతో ఎస్‌కే బాబు కోపోద్రిక్తులయ్యారు. ఇదే సమయంలో వైసీపీ కార్పొరేటర్ గణేష్ ఆవేశంగా మాట్లాడటంతో, ఎస్కే బాబు సోదరుడి కుమారుడు రంగ ప్రవేశం చేసి గణేష్‌పై చేయి చేసుకున్నారు.కూటమి కార్పొరేటర్లు అతడిని దండించి వెలుపలకు పంపారు.తనకు న్యాయం చేయాలంటూ గణేష్ అక్కడే బైఠాయించారు. దీంతో ఎస్‌కే ఆయనకు క్షమాపణ చెప్పారు. ఈ విషయంలో క్రిమినల్ చర్యలకు తాను, తన అనుచరుడు సిద్ధమని చెప్పడంతో వివాదం సద్దుమణిగింది.

'స్కిట్' తరగతులపై గందరగోళం

● కలికిరి కళాశాలకు విద్యార్థులను పంపాలంటూ జేఎన్‌టీయూ నిర్ణయం

● పిల్లల భవిష్యత్తుతో చెలగాటం తగదంటూ తల్లిదండ్రుల నిరసన



స్కిట్ కళాశాల వద్ద నిరసన తెలుపుతున్న తల్లిదండ్రులు

శ్రీకాళహస్తి, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): స్కిట్ ఇంజనీరింగ్ కళాశాలలో తరగతుల ఆరంభంపై మళ్లీ గందరగోళ పరిస్థితి నెలకొంది. అడ్మిషన్లు తక్కువగా ఉండటంతో తొలి ఏడాది విద్యార్థులకు కలికిరిలో తరగతులు నిర్వహిస్తామని జేఎన్‌టీయూ నిర్వాహకులు ప్రకటించడంపై వ్యతిరేకత వ్యక్తమైంది. శ్రీకాళహస్తిలో అడ్మిషన్ తీసుకున్న తమ పిల్లలను రెండు నెలలు ఆలస్యంగా ఇతర ప్రాంతానికి తరలించాలని సూచించడంపై తల్లిదండ్రులు మండిపడుతున్నారు. కళాశాల వద్ద శుక్రవారం నిరసన వ్యక్తం చేశారు. ఈ విద్యాసంవత్సరం స్కిట్ పునఃప్రారంభమయ్యాక 43 మంది విద్యార్థులు అడ్మిషన్లు పొందారు. కళాశాలను ముక్కంటి ఆలయం నుంచి జేఎన్‌టీయూకు అధికారికంగా లీజు ప్రాతిపదికన అప్పగింతకు జీవో మూడు రోజుల క్రితం వెలువడింది. తొలి ఏడాది విద్యార్థుల సంఖ్య తక్కువగా ఉండటంతో కలికిరి కళాశాలలో తరగతులు నిర్వహించేలా చూస్తామని శుక్రవారం జేఎన్‌టీయూ ప్రతినిధి వెంకటేశ్వరరావు తల్లిదండ్రులకు చెప్పడంతో వారు అసంతృప్తి వ్యక్తం చేశారు. కౌన్సెలింగ్ సమయంలో ఎన్నో కళాశాలల్లో అవకాశాలు ఉన్నప్పటికీ స్థానికంగా తమ పిల్లలను చదివించుకోవచ్చన్న ఉద్దేశంతో అడ్మిషన్లు పొందామన్నారు. ఇపుడు సమీపంలో ఎక్కడా అవకాశం లభించదని ఆవేదన వ్యక్తం చేశారు.హోంసిక్‌తో బాధపడే పిల్లలు కలికిరికి ఎలా వెళ్లగలరని ప్రశ్నించారు. రెండు నెలలు ఆలస్యం కావడంతో ఇప్పటికే తొలి ఏడాది విద్యలో వెనుకబడ్డారని వాపోయారు. శ్రీకాళహస్తిలోనే తరగతులు నిర్వహించేలా మంత్రి లోకేశ్, ఎమ్మెల్యే సుధీర్ చొరవ తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

● శ్రీసిటీలో నిట్టన్ ఇండియా

అదనపు ఉత్పత్తి కేంద్రం ప్రారంభం

సత్యవేడు, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): శ్రీసిటీలోని జపాన్‌కు చెందిన నిట్టన్ వాల్వ్ కంపెనీ లిమిటెడ్ అనుబంధ సంస్థ నిట్టన్ ఇండియా టెక్ (ఎన్ఐటీ) పరిశ్రమ అదనపు ఉత్పత్తి కేంద్రాన్ని శుక్రవారం ప్రారంభించింది. హ్యుందాయ్, హోండా, టయోటా, అశోక్ లేలాండ్, రాయల్ ఎన్‌ఫీల్డ్, యమహా, హెచ్ఎంఎస్ఐ వంటి ప్రముఖ ఆటోమొబైల్ సంస్థలకు ఇంజిన్ వాల్వ్‌లు సరఫరా చేస్తున్న నిట్టన్ ఇండియా ఈ అదనపు ప్లాంట్ నిర్మాణంతో వార్షిక ఉత్పత్తి సామర్థ్యం 12 మిలియన్ల నుంచి 24 మిలియన్లకు పెంచింది. ఈ సందర్భంగా నిట్టన్ ఇండియా టెక్ ఎండీ యంగ్ ఓకో మాట్లాడుతూ... 2018 అక్టోబరులో ప్రారంభమైన తమ ప్రయాణాన్ని, లక్ష్యాన్ని గుర్తు చేసుకున్నారు. భవిష్యత్తులో ఉత్పత్తి సామర్థ్యాన్ని మరింత విస్తరించే దిశగా ముందుకు సాగుతామన్నారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన హ్యుందాయ్ మోటార్స్ ఇండియా వైస్ ప్రెసిడెంట్ సుందర్ మాట్లాడుతూ... నిట్టన్ నాణ్యమైన ఉత్పత్తులు తమ సంస్థ విజయంలో కీలక భాగస్వామిగా మారాయన్నారు. శ్రీసిటీ ఎండీ రవీంద్ర సన్నారెడ్డి మాట్లాడుతూ.. 2014లో శ్రీసిటీలో ప్రారంభమైన నిట్టల్ కంపెనీ నాణ్యతా ప్రమాణాలకు పెద్ద పీట వేస్తూ బలమైన ముద్రను చాటుకుందని తెలిపారు. నూతన ప్లాంట్ సుమారు 7 ఎకరాల విస్తీర్ణంలో ఏర్పాటు చేశారు. దీంతో సంస్థ పెట్టుబడి రూ.257 కోట్లకు.. ఉద్యోగుల సంఖ్య 270 నుంచి 370కు పెరిగింది. ఈ కార్యక్రమంలో నిట్టన్ సంస్థ ప్రతినిధులు టెరుఅకి అండో, యుమికి షిండో, చో సియంగ్ హ్వాన్, రోయూన్ హో తదితరులు పాల్గొన్నారు.



ఉత్పత్తులు ప్రారంభిస్తున్న నిట్టన్ కార్పొరేషన్ ప్రెసిడెంట్ లీ తైహ్వాన్

ముక్కంటి ధర్మకర్తలమండలిలో నలుగురు సభ్యుల ప్రమాణ స్వీకారం



శ్రీకాళహస్తి, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయ ధర్మకర్తలమండలి సభ్యుడిగా వాకిచర్ల గుర్రప్పశెట్టి శుక్రవారం ప్రమాణ స్వీకారం చేశారు. ఆలయంలోని గురుదక్షిణామూర్తి సన్నిధి వద్ద ఎమ్మెల్యే సుధీర్, ఈవో బాపిరెడ్డి సమక్షంలో బాధ్యతలు స్వీకరించారు. ధర్మకర్తలమండలి సభ్యుడిగా గుర్రప్పశెట్టి బాధ్యతలు చేపట్టడం ఇది రెండోసారి కావడం గమనార్హం. ఆయనతో పాటు గాదిపాకుల గోపి, లక్ష్మమ్మ, విశాలాక్షి కూడా సభ్యులుగా ప్రమాణస్వీకారం చేశారు. ఆలయాధికారులు, టీడీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

→ ప్రమాణ స్వీకారం చేస్తున్న వాకిచర్ల గుర్రప్పశెట్టి

రేణిగుంట సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ అటెండర్ సస్పెన్షన్

ఇన్‌చార్జ్ సబ్ రిజిస్ట్రార్‌పై విచారణకు ఆదేశం

రేణిగుంట అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): రేణిగుంట సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో ఇటీవల జరిగిన పరిణామాలపై రిజిస్ట్రేషన్ శాఖ ఉన్నతాధికారులు చర్యలు చేపట్టారు. రేణిగుంట సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయ అటెండర్ తిరుమలేశ్, ఇన్‌చార్జి సబ్ రిజిస్ట్రార్ ఆనంద్‌రెడ్డి మధ్య జరిగిన వివాదాల నేపథ్యంలో ఇద్దరూ పోలీసులకు ఫిర్యాదు చేసుకున్నారు. అలాగే ఇటీవల డాక్యుమెంట్ రైటర్లు, అటెండర్ మధ్య వాగ్వాదం జరిగింది. విధుల్లో ఉండగా మీడియాతో మాట్లాడటం, సబ్‌రిజిస్ట్రార్‌పై అవినీతి ఆరోపణలు చేయడంపై అనంతపురం రిజిస్ట్రార్ నివేదిక మేరకు అటెండర్ తిరుమలేశ్‌ను సస్పెండ్ చేశారు. అక్రమ రిజిస్ట్రేషన్ల ఆరోపణల నేపథ్యంలో ఇన్‌చార్జి సబ్‌రిజిస్ట్రార్ ఆనంద్‌రెడ్డిపై విచారణకు ఆదేశించారు. ఈ మేరకు జిల్లా సబ్‌రిజిస్ట్రార్ రాంకుమార్ ఉత్తర్వులు జారీ చేశారు.

ప్రేమించకుంటే కుటుంబాన్ని చంపేస్తా..

బాలికను వేధించిన కేసులో నిందితుడి అరెస్టు

తిరుపతి(నేరవిభాగం), అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): 'నేను నిన్ను ప్రేమిస్తున్నాను...నువ్వు నన్ను ప్రేమించకుంటే మీ కుటుంబాన్ని చంపేస్తా' అని బాలికను వేధించిన యువకుడిని తిరుపతి రూరల్ పోలీసులు శుక్రవారం అరెస్టు చేశారు. అదనపు ఎస్పీ రవిమనోహరాచారి వివరాల మేరకు.. చిత్తూరు జిల్లా చెన్నంపల్లి గ్రామానికి చెందిన కోలా దిలీప్‌కుమార్ తిరుపతిలోని ఒక అపార్టుమెంటులో కాపురముంటున్నాడు. అదే ప్రాంతానికి చెందిన బాలికను ఆరు నెలలుగా ప్రేమ పేరుతో వేధిస్తున్నాడు. వెంటపడి బెదిరిస్తున్నాడు. గురువారం రాత్రి బాలిక ఇంటి వద్దకు వెళ్లి ఆమె చేయి పట్టుకుని ప్రేమించకపోతే కుటుంబాన్ని చంపేస్తానని బెదిరించాడు. బాలిక కేకలు వేయడంతో తల్లి, అన్న వచ్చి అడ్డుకున్నారు. వారినీ బెదిరించాడు. చుట్టుపక్కల వారు అక్కడకు రావడంతో పారిపోయాడు. బాధితురాలి తల్లి ఫిర్యాదు మేరకు పోక్సో కేసు నమోదు చేసిన తిరుపతి రూరల్ పోలీసులు శుక్రవారం కోలా దిలీప్‌కుమార్‌ను ఆర్సీ పురం జంక్షన్ వద్ద అరెస్టు చేశారు.



పోలీసుల అదుపులో నిందితుడు

44 మంది సచివాలయ ఉద్యోగులకు షోకాజ్ నోటీసులు

● పింఛన్ల పంపిణీలో ఆలస్యం చేసిన ఫలితం

తిరుపతి(కలెక్టరేట్), అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ సామాజిక భద్రతా పింఛన్లను ఆలస్యంగా పంపిణీ చేసిన 44 మంది గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులకు షోకాజ్ నోటీసులు జారీ అయ్యాయి. ప్రతినెలా ఒకటో తేదీ ఉదయం 7 గంటల నుంచి సచివాలయ ఉద్యోగులు ఇంటింటికీ వెళ్లి పింఛన్ పంపిణీ చేయాల్సి ఉంది. అయితే పది గంటల్లోపు ఒకరికి కూడా ఇవ్వకపోవడంపై కలెక్టర్ వెంకటేశ్వర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆయన ఆదేశాల మేరకు.. జిల్లాలోని శ్రీకాళహస్తి, గూడూరు, తిరుపతి, తడ, నాయుడుపేట, చిట్టమూరు, కోట, వాకాడు, బాలాయపల్లి, వెంకటగిరి, డక్కిలి, చంద్రగిరి, చిన్నగొట్టిగల్లు, వడమాలపేట, పాకాల, నాగలాపురం, సత్యవేడు, వరదయ్యపాళెం, బీఎన్‌కండ్రిగ, పుత్తూరు ప్రాంతాలకు చెందిన 44మంది సచివాలయ ఉద్యోగులకు మండలాధికారులు షోకాజు నోటీసులు జారీ చేశారు.

పుత్తూరు వార్తలు

సదాశివకోనలో జలపాతాల సోయగం



జాలువారుతున్న సదాశివ కోన, అమ్మవారి కోన

వడమాలపేట, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): మండలంలో దట్టమైన అటవీ ప్రాంతంలోని సదాశివ కోన, అమ్మవారి కోనల్లో జలపాతాలు ఉవ్వెత్తున ఎగసి పడుతున్నాయి. నాలుగైదు రోజులుగా వర్షం కురవడంతో సదాశివకోన జలపాతం ఉధృతంగా జాలువారుతోంది. అలాగే సమీపంలోని అమ్మవారి కోనలో కుడా జలపాతం కుండపోతలా పడుతోంది. కార్తీక మాసంలో వర్షాలకు జలపాతాల సోయగం అలరిస్తోంది.

ఆలయ దర్శనాలకు ప్రత్యేక బస్సు సర్వీసులు

పుత్తూరు, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): కార్తీకమాసంలో ప్రతి సోమవారం భక్తుల కోసం ఆలయాల దర్శనానికి రెండు ప్రత్యేక బస్సులను నడుపుతున్నామని పుత్తూరు ఆర్టీసీ డిపో మేనేజర్ మహేంద్ర చెప్పారు. ఈ బస్సులు తిరుపతి నుంచి ఉదయం 5, 6 గంటలకు బయలు దేరుతాయన్నారు. ఈ స్పెషల్ సర్వీసులు కైలాసకోన, సురుటుపల్లి, నాగలాపురం, రామగిరి, సింగిరికోన, నారాయణవనం, అప్పలాయగుంట మీదుగా తిరుపతి చేరుకుంటాయని తెలిపారు. ఆలయ దర్శన బస్సుల టిక్కెట్ ధర పెద్దలకు రూ.360, పిల్లలకు రూ.190లని తెలిపారు. భక్తులు శబరిమలై వెళ్లేందుకు ముందస్తుగా కోరితే అద్దె బస్సులను ఏర్పాటు చేస్తామన్నారు.

ఇంటి పన్ను డిమాండ్ నోటీసుల పంపిణీలో నిర్లక్ష్యం!

పుత్తూరు అర్బన్, అక్టోబర్ 24(ఆంధ్రజ్యోతి): ఇంటి పన్ను డిమాండ్ నోటీస్‌ల పంపిణీలో సిబ్బంది నిర్లక్ష్యం మున్సిపాలిటి ఆదాయానికి గండి పడుతోంది. ఏటా ఇంటి పన్నుల రూపంలో పుత్తూరు మున్సిపాలిటీకి రూ.5.98 కోట్లు ఆదాయం చేకూరుతుంది. పట్టణంలో మొత్తం 14,150 అసెస్‌మెంట్లు ఉన్నాయి. ఏటా మే నెలలో ఆస్తి పన్నుకు సంబంధించిన డిమాండ్ నోటీసులను సదరు యజమానులకు అందజేయాల్సి ఉంటుంది. సచివాలయం వ్యవస్థ వచ్చిన తరువాత డిమాండ్ నోటీసుల పంపిణీ సులభతరం అవుతుందని మున్సిపల్ అధికారులు భావించారు. అయితే 2025-26 ఏడాది 41 శాతం మాత్రమే పన్ను వసూలైందని రెవెన్యూ అధికారులు చెబుతున్నారు. దీనిపై గురువారం గోవింద పాళెం సచివాలయం పరిధిలో ఓ ఇంటి యజమాని మున్సిపల్ కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. ఇంటి పన్నుకు సంబంధించిన డిమాండ్ నోటీస్ తనకు ఇవ్వలేదని పేర్కొన్నారు. స్పందించిన కమిషనర్ డిమాండ్ నోటీసుల పంపిణీపై ఆరా తీశారు. సచివాలయం అడ్మిన్లకు పన్ను డిమాండ్ల పంపిణీ బాధ్యతలు అప్పగించారు. అనంతరం అక్నాలెడ్జ్‌ను మున్సిపల్ అధికారులకు అందజేయాల్సి ఉంది. అలా ఏ ఒక్క సచివాలయం అడ్మిన్ చేయలేదు. ప్రశ్నించడంలో మున్సిపల్ అధికారులు విఫలమయ్యారు.

హెల్ప్‌లైన్ ఏర్పాటు

పుత్తూరు అర్బన్, అక్టోబర్ 24(ఆంధ్రజ్యోతి): తుపాను తీరం దాటే సమయంలో భారీ నుంచి అతి భారీగా వర్షాలు కురిసే అవకాశం ఉందని రాష్ట్ర వాతావరణ శాఖ సూచనల నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలని మున్సిపల్ కమిషనర్ మంజునాథ గౌడ్ ప్రజలకు తెలియజేశారు. విపత్తు పరిస్థితుల సమన్వయం కోసం హెల్ప్‌లైన్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అత్యవసర పరిస్థితుల్లో నెం.7075067503, 7989995876 అందుబాటులో ఉంటాయన్నారు.

పాస్టర్ నియామకంలో వివాదం

పుత్తూరు అర్బన్, అక్టోబర్ 24(ఆంధ్రజ్యోతి): బదిలీపై వెళ్లేందుకు పాస్టర్ ఇష్టపడక పోవడంతో వివాదం తలెత్తింది. పోలీసుల జోక్యంతో సద్దుమణిగింది. మండలంలోని గోవిందపాళెం సెయింట్ లూథరన్ చర్చ్ పాస్టర్‌గా 15 యేళ్లుగా సుందర్ శేఖర్ పనిచేస్తున్నారు. మూడు నెలల క్రితం ఆయన్ను నాయుడుపేటకు బదిలీ చేస్తూ తిరుపతి ఈస్ట్ మిషన్ కాంపౌండ్ నుంచి ఉత్తర్వులు వెలువడ్డాయి. కాగా, సూళ్లూరుపేట నుంచి గోవిందపాళెం చర్చికి బదిలీపై వచ్చిన మహేంద్రకు బాధ్యతలు అప్పగించక పోగా అడ్డుకోవడంతో శుక్రవారం వివాదం నెలకొంది. సమాచారం అందుకున్న పుత్తూరు డీఎస్పీ రవికుమార్, సీఐ శేఖర్‌రెడ్డి, ఎస్ఐ ఓబయ్య సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకుని సంఘ కాపరులతో చర్చించారు. ఈక్రమంలో సుందర్ శేఖర్‌ను విధుల నుంచి తొలగిస్తూ ఈస్ట్ మిషన్ నుంచి ఉత్తర్వులు వెలువడ్డాయి. దీంతో చేసేదేమీలేక ఆయన అక్కడ నుంచి వెళ్లిపోయారు. మహేంద్ర బాధ్యతలు స్వీకరించి ప్రార్థనలు నిర్వహించారు.

బోరు సెంటర్ దారికి మరమ్మతులు చేపట్టరూ...!



పుత్తూరు టౌన్, అక్టోబర్ 24(ఆంధ్రజ్యోతి): మండలంలో తడుకు పంచాయతీలోని టీఆర్ కండ్రిగ, వీఎస్ఎస్ పురం, ఎస్టీకాలనీ, గొల్లపల్లి పంచాయతీలోని బోరుసెంటర్‌కు వెళ్లే ప్రధాన రహదారి వర్షాలకు ఛిద్రమైంది. ప్రత్యేకించి వైద్య సంబంధిత అత్యవసర పరిస్థితుల్లో ప్రయాణించడానికి ఎక్కువ సమయం పడుతోంది. సంబంధిత అధికారులు స్పందించి రహదారికి మరమ్మతులు చేపట్టాల్సి ఉంది.

వెంకన్న సేవలో ప్రజ్ఞానంద ఆశ్రమ పీఠాధిపతి



వడమాలపేట, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): మండలంలోని అప్పలాయ గుంటలోని ప్రసన్న వేంకటేశ్వర స్వామిని ప్రజ్ఞానంద ఆశ్రమ పీఠాధిపతి బాల స్వామి దర్శించుకున్నారు. పశ్చిమ గోదావరి జిల్లా పెనుగొండలోని ప్రజ్ఞానంద ఆశ్రమ పీఠాధిపతి శిష్య బృందంతో స్వామిని దర్శించుకున్నారు. ఆలయ ప్రధాన అర్చకుడు సూర్యకుమారాచార్యులు ఆలయ చరిత్రను వివరించి తీర్థప్రసాదాలను అందించారు. ఆలయ అధికారి వేణుగోపాల్ దర్శన ఏర్పాట్లు చేశారు.

రోడ్డు ప్రమాదంలో స్కూటరిస్టు మృతి



ఉదయ్‌కుమార్ (ఫైల్‌ఫొటో)

వెదురుకుప్పం, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో స్కూటరిస్టు మృతిచెందాడు. మృతుడి తండ్రి భాస్కర్ కథనం మేరకు.. తిరుపతి జిల్లా పుత్తూరు సమీపంలోని చిన్నరాజుకుప్పం ఏపడబ్ల్యూకు చెందిన ఉదయ్‌కుమార్(31) గురువారం సాయంత్రం స్వగ్రామం నుంచి టీవీఎస్ ఎక్సెల్‌లో బయలుదేరి వెళ్లాడు. కార్వేటినగరం మండలం అమ్మపల్లి క్రాస్ రోడ్డు సమీపంలో రాత్రి సుమారు 11.15 గంటల సమయంలో వర్షానికి అదుపు తప్పి కిందపడ్డాడు. దీంతో అతడు మృతిచెందాడు. కార్వేటినగరం పోలీసులు అతడి మృతదేహాన్ని పుత్తూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేశారు.

గూడూరు

సూళ్లూరుపేట/వెంకటగిరి

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

నాయుడుపేట టౌన్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో తుమ్మూరు సబ్ స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా శనివారం ఉదయం 8నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని పట్టణ ఏఈ శివశంకర్ తెలిపారు.

రైలు ఢీకొని గుర్తుతెలియని వృద్ధుడి మృతి

సూళ్లూరుపేట, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట రైల్వేగేటు సమీపంలోని సత్యసాయి బాబా మందిరం వద్ద శుక్రవారం కోరమాండల్ ఎక్స్‌ప్రెస్ ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. సుమారు 60 సంవత్సరాల వయసున్న వ్యక్తి పట్టాలు దాటుతుండగా రైలు ఢీకొంది. రైల్వే పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతుడి వద్ద ఎటువంటి ఆధారాలు లభించలేదు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

డివైడర్‌ను ఢీకొన్న రొయ్యల వ్యాన్

కోట, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): కోట పట్టణ పరిధిలోని తిన్నెలపూడి రోడ్డు వద్ద శుక్రవారం రాత్రి రొయ్యల లోడ్‌తో వెళ్తున్న వ్యాన్ డివైడర్‌ను ఢీకొని బోల్తా పడింది. వాకాడు నుంచి రొయ్యల లోడ్‌తో నెల్లూరు వెళ్తున్న వ్యాన్ తిన్నెలపూడి క్రాస్‌రోడ్డు వద్ద డివైడర్‌ను ఢీకొని ట్రాన్స్‌ఫార్మర్ సమీపంలో పడింది. ఈ ప్రమాదంలో డ్రైవర్, క్లీనర్‌కు స్వల్ప గాయాలయ్యాయి.



గుంతలతో పాటు రాళ్లు తేలిన రోడ్డు - వర్షానికి మడులను తలపిస్తున్న గోతులు

అడుగడుగునా గోతులు... ప్రయాణం సాగేదెలా?

అధ్వానంగా కోటపోలూరు రోడ్డు

సూళ్లూరుపేట, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట నుంచి కోటపోలూరుకు వెళ్లే రోడ్డు అధ్వానంగా తయారైంది. ముందే గుంతలమయంగా ఉన్న ఈ రోడ్డు వారం రోజుల నుంచి కురుస్తున్న వర్షానికి మడుగులను తలపిస్తోంది. సూళ్లూరుపేట హైవే నుంచి కోటపోలూరు ఈస్ట్ హరిజనవాడ రోడ్డు వరకు అడుగడుగునా గోతులు ఏర్పడడంతో వాహన చోదకులు అవస్థలు పడుతున్నారు. సూళ్లూరుపేట నుంచి కోట - వాకాడుకు కోటపోలూరు మీదుగా రోజూ వందలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. కోటపోలూరు, సామంతమల్లాం, ఆబాక, కారికాడు, జంగాలగుంట, మీజూరు గ్రామాల ప్రజలు ఈ రోడ్డు గుండానే సూళ్లూరుపేటకు వచ్చిపోతుంటారు. హైవే నుంచి గ్రామాల గమ్యం చేరే వరకు దారిపొడవునా గోతులు ఉండడంతో వాహనాలు తరచూ ప్రమాదాలకు గురవుతున్నాయి. చిన్నపాటి వర్షమొచ్చిన గుంతల్లో నీరు నిలబడి వాహనాలు వెళ్లలేని పరిస్థితి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక సూళ్లూరుపేట నుంచి కోటపోలూరు వరకు నాలుగు కిలో మీటర్ల మేర రోడ్డుకు మరమ్మతులు చేపట్టారు. అయితే రోడ్డంతా రాళ్లు తేలిపోయి అధ్వానంగా తయారైంది. రోడ్డుకు మరమ్మతులు చేయాలని ప్రజలు పలుమార్లు విన్నవించినా పట్టించుకునే నాథుడే కరువయ్యారు. ఈ విషయమై ఆర్అండ్‌బీ డీఈ పరమేశ్వరిని వివరణ కోరగా కోటపోలూరు రోడ్డు మరమ్మతులకు ప్రతిపాదనలు పంపామని, త్వరలోనే అనుమతులు వస్తామని, గోతులు పూడ్చి రోడ్డును బాగు చేస్తామని చెప్పారు.



గాజులపెళ్లూరు, గాజులపెళ్లూరు బస్టాండ్, సాధనవారిపాళెం వద్ద గుంతలు

వర్షాలతో అధ్వానంగా మారిన సూళ్లూరుపేట రోడ్డు

అమలు కాని ఉప ముఖ్యమంత్రి హామీ ● రెండు వరుసల రహదారి కోసం నిరీక్షణ

బుచ్చినాయుడుకండ్రిగ, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట -బుచ్చినాయుడుకండ్రిగ రహదారి ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు అధ్వానంగా మారింది. పెరిటిపాడు వరకు రోడ్డు ఛిద్రమైంది. మతకాముడి, గాజులపెళ్లూరు మధ్య అర కిలోమీటరు రోడ్డులో పెద్దపెద్ద గుంతలతో పాటుగా కోతకు గురికావడంతో రాకపోకలకు ఇబ్బంది పడుతున్నారు. అదే విధంగా ఉగ్గుముడి, సాధన వారిపాళెం, సీసీఎల్ పరిశ్రమ, సంతవేలూరుల సమీపంలో రోడ్డులో గుంతల కారణంగా ద్విచక్ర వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. బస్సులు, లారీలకు ఇబ్బందులు తప్పడం లేదు. బీఎన్‌కండ్రిగ, శ్రీకాళహస్తి మండలాల నుంచి సూళ్లూరుపేటలోని అపాచీ పరిశ్రమకు నిత్యం వందలాది మంది కార్మికులు బస్సులు, ద్విచక్ర వాహనాలలో రాకపోకలు సాగిస్తుంటారు. సింగిల్ రోడ్డు కావడంతో ప్రయాణానికి ఇబ్బందులు తప్పడం లేదు. వాహనాలు ఎదురుగా వచ్చినప్పుడు రోడ్డు దిగితే గుంతల్లో ఇరుక్కుపోతున్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో సూళ్లూరు పేట నుంచి పెరిటిపాడు వరకు రెండు వరుసల రహదారిని నిర్మించారు. కాంట్రాక్టర్‌కు బిల్లులు అందకపోవడంతో పెరిటిపాడు నుంచి బీఎన్‌కండ్రిగ వరకు పది కిలోమీటర్ల రోడ్డు పనులు ఆపివేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత 2024 ఆగస్టు 13న ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ శ్రీహరికోటలోని షార్‌ను సందర్శించేందుకు బుచ్చినాయుడుకండ్రిగ నుంచి సూళ్లూరుపేటకు మీదగా వెళ్లారు. ఆ దారిలో ఇబ్బందులను గుర్తించి వెంటనే మరమ్మతు పనులు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. అయితే అధికారులు రహదారికి ఇరువైపులా మట్టి పోసి చేతులు దులుపుకున్నారు. ఉప ముఖ్యమంత్రి ఆదేశాలతో రెండు వరుసల రహదారి వస్తుందని ఎదురు చూసిన గ్రామీణు లకు నిరాశే మిగిలింది.

ప్రయాణించలేకపోతున్నాం



బుచ్చినాయుడుకండ్రిగ నుంచి ప్రతిరోజూ అపాచీ పరిశ్రమకు బస్సులో వెళ్లడానికి నానా ఇబ్బందులు పడుతున్నా. అరగంట ప్రయాణానికి గంటకుపైగా పడుతోంది. రోడ్డులోని గంతలతో నడుము నొప్పితో ఇబ్బంది పడుతున్నా. రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలి.

- వెంకటరమణ, అపాచీ కార్మికుడు

ఆటోకు ప్రతి నెలా మరమ్మతులే



బుచ్చినాయుడుకండ్రిగ నుంచి సూళ్లూరుపేట రోడ్డులో ఆటో తోలుతుంటా. రోడ్డు గుంతలమయంగా ఉండడంతో ప్రతి నెలా ఆటో మరమ్మతులు చేయిస్తున్నా. ఆటో ద్వారా వచ్చే ఆదాయం కన్నా మరమ్మతులకే ఎక్కువ ఖర్చు చేస్తున్నా. ప్రస్తుతం కురుస్తున్న వరాల్షతో రోడ్డులో ఆటోను తిప్పడం మానేశా.

- చిట్టి, ఆటో డ్రైవర్

రెండు వరుసల రహదారి నిర్మించండి



కూటమి ప్రభుత్వం అయినా బుచ్చినాయుడుకండ్రిగ - సూళ్లూరుపేట రహదారిని రెండు వరుసలుగా మార్చాలి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత రాష్ట్రంలో అనేక రోడ్లకు నిధులు మంజూరు చేసి బాగు చేశారు. నిత్యం వందలాది మంది కార్మికులు ప్రయాణించే ఈ మార్గం సక్రమంగా లేని కారణంగా ఇబ్బంది పడుతున్నాం.

- శ్రీనివాసులురెడ్డి, రైతు

శాకాంబరిదేవిగా రాజరాజేశ్వరిదేవి



గూడూరు, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): స్థానిక జడ్పీ హైస్కూల్ రోడ్డులోని రాజరాజేశ్వరిదేవి ఆలయంలో శుక్రవారం అమ్మవారిని శాకాంబరిగా అలంకరించి పూజలు జరిపారు. దసరా నెల పొంగళ్ల పూజా కార్యక్రమాల్లో భాగంగా అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి విశేష పూజలు జరిపారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని కార్తీక దీపాలను వెలిగించి మొక్కులు తీర్చుకున్నారు.

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

వాకాడు, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): వర్షాల నేపథ్యంలో సీజనల్ వ్యాధుల పట్ల సచివాలయ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ఎంపీడీవో సాయి ప్రసాద్ అన్నారు. శుక్రవారం వాకాడు సచివాలయం-1ను తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. వీధుల్లో మురుగు నిల్వలేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, బ్లీచింగ్ చల్లి ఫాగింగ్ చేయాలన్నారు.

వినియోగదారులకు విశ్వసనీయమైన సేవలు



స్టీల్స్, సిమెంట్ దుకాణాన్ని ప్రారంభిస్తున్న పారిశ్రామికవేత్త కొండేపాటి గంగాప్రసాద్, ఎమ్మెల్యేలు సునీల్ కుమార్, రామకృష్ణ

గూడూరు, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): స్థానిక చిల్లకూరు బైపాస్ రోడ్డులో నూతనంగా ఏర్పాటు చేసిన ఎస్ స్టీల్స్, సిమెంట్ దుకాణాన్ని ప్రముఖ పారిశ్రామికవేత్త కొండేపాటి గంగాప్రసాద్ శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం నిర్మాణ రంగంలో నాణ్యతకు ప్రాధాన్యం పెరిగిందన్నారు. మంచి నాణ్యత గల ఇనుము, సిమెంట్‌ను హోల్‌సేల్ ధరలకే రీటైల్‌గా వినియోగదారులకు అందజేసేలా గూడూరులో దుకాణం ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. దుకాణ యజమానురాలు గోను సంధ్యారాణి మాట్లాడుతూ వినియోగదారులకు విశ్వసనీయమైన సేవలను అందించడమే తమ లక్ష్యమన్నారు. తమ దుకాణంలో అన్ని రకాల స్టీల్, సిమెంట్ బ్రాండ్లు సరసమైన ధరలకే అందజేస్తామన్నారు. కార్యక్రమంలో గూడూరు, వెంకటగిరి, సూళ్లూరుపేట ఎమ్మెల్యేలు పాశం సునీల్ కుమార్, కురుగొండ్ల రామకృష్ణ, నెలవల విజయశ్రీ, ఎమ్మెల్సీ బల్లి కల్యాణ్‌చక్రవర్తి, పెంచలకోన ఆలయ మాజీ ఛైర్మన్ తానంకి నానాజీ, కొండేపాటి కోమలి, జశ్వంత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థిని ప్రాణాలు కాపాడిన మంత్రి స్వామి

గూడూరు, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): అనారోగ్యంతో బాధపడుతూ చికిత్స పొందుతున్న ఓ విద్యార్థినికి మెరుగైన వైద్యం అందేలా రాష్ట్ర సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డోలా బాలవీరాంజనేయస్వామి చర్యలు తీసుకుని ప్రాణాలను కాపాడారు. నెల్లూరు జిల్లా రాపూరు ఎస్సీ బాలికల వసతి గృహంలో ఉంటూ 6వ తరగతి చదువుతున్న ఓ విద్యార్థిని ఇటీవల తీవ్ర అస్వస్థతకు లోనైంది. వార్డెన్ వెంటనే విద్యార్థినిని గూడూరులోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చేర్పించారు. ఈ విషయం తెలుసుకున్న మంత్రి తిరుపతి జిల్లా కలెక్టర్, వైద్యులతో మాట్లాడి తిరుపతి స్విమ్స్‌లో చేర్పించి మెరుగైన వైద్యం అందించేలా చర్యలు తీసుకున్నారు. దీంతో ఆ విద్యార్థిని ప్రాణాపాయస్థితి నుంచి కోలుకుని ఆరోగ్యం కుదుటపడింది. మరికొద్ది రోజుల్లో ఆస్పత్రి నుంచి విద్యార్థినిని డిశ్చార్జి చేస్తామని వైద్యులు వెల్లడించారు. విద్యార్థిని, ఆమె తల్లిదండ్రులు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు, మంత్రి డోలా బాలవీరాంజనేయస్వామికి కృతజ్ఞతలు తెలిపారు. కాగా, తాను సాంఘికశాఖ సంక్షేమ మంత్రిగా బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి ఇప్పటి వరకు అంబేడ్కర్ గురుకులాలు, సంక్షేమ వసతిగృహాల్లో అనారోగ్యానికి గురైన 30 మందికి పైగా విద్యార్థులను కార్పొరేట్ ఆస్పత్రుల్లో చేర్పించి మెరుగైన వైద్యసేవలు అందించేలా చర్యలు తీసుకున్నట్లు మంత్రి బాలవీరాంజనేయస్వామి ఓ ప్రకటనలో శుక్రవారం పేర్కొన్నారు.

డిప్యూటీ ఎంపీడీవోగా కాశీ నాయక్



ఎంపీడీవో ఉమామహేశ్వరావుకు జాయినింగ్ రిపోర్ట్ అందజేస్తున్న డిప్యూటీ ఎంపీడీవో కాశీ నాయక్

చిట్టమూరు, అక్టోబర్ 24(ఆంధ్రజ్యోతి): చిట్టమూరు డిప్యూటీ ఎంపీడీవోగా కాశీ నాయక్ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ప్రకాశం జిల్లా నాగులప్పలపాడు మండలం నిడమనూరు పంచాయతీ గ్రేడ్ 1 కార్యదర్శిగా పనిచేసిన కాశీ నాయక్ పదోన్నతిపై చిట్టమూరు డిప్యూటీ ఎంపీడీవోగా వచ్చారు.

ప్రత్యేక ఆధార్ శిబిరాలను సద్వినియోగం చేసుకోండి

పెళ్లకూరు, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం మరోమారు గ్రామాల్లో ఏర్పాటు చేస్తున్న ప్రత్యేక ఆధార్ శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని ఉమ్మడి నెల్లూరు జిల్లా సర్పంచుల సంఘం అధ్యక్షుడు, జీలపాటూరు సర్పంచు కందమూడి శివకుమార్ కోరారు. శుక్రవారం మండలంలోని జీలపాటూరు, అనకవోలు, చెంబేడు ప్రాథమిక పాఠశాలలో ప్రత్యేక ఆధార్ శిబిరాలను ఏర్పాటు చేశారు. జీలపాటూరు ఆధార్ కేంద్రంలో ఆయన మాట్లాడుతూ సచివాలయాలు, పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆధార్ ప్రత్యేక శిబిరాలను ఏర్పాటు చేస్తారని, 0-6 పిల్లలతో పాటు ఇప్పటి వరకు ఆధార్ లేని వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఆధార్ శిబిరాల పరిశీలన

బాలాయపల్లి, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): మండలంలోని నిడిగల్లు, వెంగమాంబపురంలోని జడ్పీ ఉన్నత పాఠశాలల్లో శుక్రవారం ఆధార్ శిబిరాలను ఏర్పాటు చేశారు. వెంగమాంబపురంలో ఆధార్ శిబిరాన్ని ఎంపీడీవో నారాయణ పరిశీలించారు. ఆయన వెంట డిప్యూటీ ఎంపీడీవో రామకృష్ణ తదితరులు ఉన్నారు.

బస్సు దగ్ధం బాధాకరం: కురుగొండ్ల

వెంకటగిరి, అక్టోబర్ 24(ఆంధ్రజ్యోతి): కర్నూల్‌లో బస్సు దగ్ధమై ప్రయాణికులు దుర్మరణం చెందడం బాధాకరమని ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ అన్నారు. శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడారు. హైదరాబాద్ నుంచి బెంగళూరు వెళ్తున్న ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు కర్నూల్ జిల్లాలో ద్విచక్ర వాహనాన్ని ఢీకొని దగ్ధమవడం, అందులోని ప్రయాణికులు నిద్రలోనే మృత్యువాత పడడం పట్ల ఎమ్మెల్యే దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.

పోటీ పరీక్షల్లో విద్యార్థుల ప్రతిభ

గూడూరు అర్బన్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): ఒలంపియాడ్ పోటీ పరీక్షల్లో శ్రీచైతన్య పాఠశాల విద్యార్థులు ప్రతిభ చాటినట్లు ప్రిన్సిపాల్ శ్రీనివాసులు అన్నారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ ఇటీవల నిర్వహించిన ఒలంపియాడ్ పోటీ పరీక్షల్లో తమ పాఠశాలకు చెందిన 14మంది విద్యార్థులు లెవెల్-1లో ఉత్తీర్ణత సాధించి లెవెల్-2 పరీక్షలకు అర్హత సాధించారన్నారు. ప్రతిభచాటిన విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో శ్రీకాంత్, శ్రీహరిబాబు, హరిబ్రహ్మ, చందన, కిరణ్మయి తదితరులు పాల్గొన్నారు.

రాజ్యాంగం పట్ల విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలి

నాయుడుపేట టౌన్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): రాజ్యాంగం పట్ల విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని నాయుడుపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు మీనా కుమారి అన్నారు. లోతువానిగుంట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం రాజ్యాంగ దినోత్సవ సన్నాహక సమావేశం నిర్వహించారు. రాజ్యాంగం పట్ల విద్యార్థులకు అవగాహన కల్పించేందుకు వ్యాస రచన, వక్తృత్వ పోటీలను నిర్వహించనున్నట్లు హెచ్‌ఎం చెప్పారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సుబ్రహ్మణ్యం, జి.వెంకటేశ్వర్లు, జి.సుబ్రహ్మణ్యం, చెంచుకుమార్, సుభాష్, శ్రావణ్, అమృత తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న హెచ్‌ఎం మీనాకుమారి

మహిళల భద్రతకు ప్రత్యేక చర్యలు



విద్యార్థినులకు అవగాహన కల్పిస్తున్న డీఎస్పీ గీతాకుమారి

గూడూరు, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): మహిళల భద్రతకు పోలీస్‌శాఖ ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు డీఎస్పీ గీతాకుమారి తెలిపారు. శుక్రవారం స్థానిక జడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో పోలీసు అమరవీరుల దినోత్సవాన్ని పురస్కరించుకుని విద్యార్థినులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎవరైనా బాలికలు, మహిళల పట్ల అస భ్యంగా ప్రవర్తిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. తల్లిదండ్రులు బాలికల పట్ల శ్రద్ధ తీసుకోవాలన్నారు. సైబర్ నేరాలపై అవగాహన పెంచుకోవడంతో పాటు మొబైల్స్‌ను అవసరమైనంత వరకే వినియోగించాలని, సోషల్ మీడి యా విషయంలో జాగ్రత్తలు పాటించాలన్నారు. కార్యక్రమంలో ఎంఈవో కాంచన, ఏఎస్ఐలు లక్ష్మీపతి, బాబురావు తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్యం మెరుగుకు చర్యలు

చిల్లకూరు, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో పారిశుధ్యం మెరుగుకు ప్రత్యేక చర్యలు చేపట్టడం జరిగిందని జడ్పీ సీఈవో మోహన్‌రావు అన్నారు. శుక్రవారం మండలంలోని కడివేడు గ్రామాన్ని సందర్శించి పారిశుధ్యం స్థితిగతులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో పారిశుధ్యం మెరుగకు ప్రత్యేక చర్యలు చేపట్టి స్వచ్ఛ గ్రామాల నిర్మాణానికి కృషి చేస్తున్నామన్నారు. కడివేడు ఎస్సీకాలనీ అభివృద్ధికి రూ.20లక్షల మంజూరయ్యాయన్నారు. ఇందులో రూ.15లక్షలు సీసీ రోడ్లు, రూ.5లక్షలు తాగునీటి కోసం ఖర్చు చేయడం జరుగుతుందన్నారు. అనంతరం ఎంపీడీవో కార్యాలయాన్ని సందర్శించి రికార్డులను పరిశీలించి అసంతృప్తి వ్యక్తం చేశారు. చారు. రికార్డుల నిర్వహణలో అలసత్వం వహిస్తే శాఖపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

వరవ కాలువల్లో పూడిక తీత


ఏర్పేడులో జరుగుతున్న పనులు

ఏర్పేడు, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): మండలంలోని వరవ కాలువల్లో పూడికనుకు స్థానిక టీడీపీ నాయకుల ఆధ్వర్యంలో చేపట్టారు. కాలువలు పూడికతో నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాలకు ఎక్కడక్కడ నీరు నిలిచి పోయింది. ఈ క్రమంలో అనేక గ్రామాల్లో సమస్యలను గుర్తించిన ఎమ్మెల్యే సుధీర్ కాలువలను శుభ్రం చేయించాలని స్థానిక నాయకులకు సూచించారు. శ్రీకాళహస్తి నియోజకవర్గ తెలుగు మహిళ అధ్యక్షురాలు గాలి కృష్ణవేణి ఆధ్వర్యంలో ఏర్పేడులో ఎక్స్‌కవేటర్ల సాయంతో పూడిక తీస్తున్నారు.

మల్లిమడుగు డ్యాం గేట్ల మూసివేత



రేణిగుంట, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): మండలంలోని మల్లిమడుగు డ్యాం 2 గేట్లను శుక్రవారం మధ్యాహ్నం మూసివేశారు. మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు శేషాచలం అటవీ ప్రాంతాల నుంచి వచ్చే వర్షపు నీటితో గురువారం తెల్లవారుజామున డ్యాం నిండడంతో 10 గేట్లను ఒక అడుగు ఎత్తి నీటిని దిగువకు వదిలిన విషయం విదితమే. ఈక్రమంలో శుక్రవారం వర్షం తగ్గుముఖం పట్ట డంతో రెండు గేట్లను మూసివేసి ఒక్క అడుగు ఎత్తి 8 గేట్ల ద్వారా నీటిని కిందకు విడుదల చేస్తున్నారు. ప్రస్తుతానికి 500 క్యూసెక్కుల నీరు డ్యాంలోకి చేరుతుండగా, అంతే పరిమాణంలో దిగువకు విడుదల చేస్తున్నామని డీఈఈ చంద్రమౌళి తెలిపారు.

కాళంగి జలాశయం 8 గేట్లు ఎత్తివేత



కేవీబీపురం, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): మండలంలోని కాళంగి జలాశయం గురువారం రాత్రి కురిసిన వర్షంతో నీటి మట్టం పెరగడంతో అధికారులు అప్రమత్తమై 8గేట్లను ఎత్తివేసి దిగువకు నీటిని విడుదల చేశారు. శుక్రవారం నీటి మట్టం 219 అడుగులకు చేరడంతో 217 అడుగుల వరకు తగ్గిస్తున్నారు. ప్రధాన మూడు గేట్లను తెరవలేదు. పక్కనున్న 18 గేట్లలో ఎనిమిది గేట్లను మాత్రమే ఎత్తినట్టు ఏఈ బాబు తెలిపారు. అయితే 217 అడుగులు రాగానే ఐదు గేట్లను మూసివేస్తామన్నారు. సిబ్బంది అప్రమత్తంగా ఉన్నారని ఏఈ చెప్పారు. కాళంగి ఆయకట్టు అధ్యక్షుడు రాజారెడ్డి పాల్గొన్నారు.

తెగిన కాంబాకం చెరువు కలుజు



వరదయ్యపాళెం, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): మండలంలో గురువారం రాత్రి నుంచి శుక్రవారం ఉదయం వరకు ఎడతెరపి లేని వర్షం కురిసింది. వాగుల్లో నీటి ప్రవాహం మరింత ఉధృతంగా పెరిగింది. శ్రీకాళహస్తి మార్గంలోని గోవర్ధనపురం వంతెనపై నీరు అధికంగా ప్రవహించడంతో ద్విచక్ర వాహనాలు, కార్లు, చిన్న వాహనాల రాకపోకలను అధికారులు నిలిపి వేశారు. పరిశ్రమలకు వెళ్లే కార్మికులకు ట్రాక్టర్ల సహాయంతో అవతలి వైపుకు చేర్చారు. మరదవాడ, అంబూరు, సంతవేలూరు, కళత్తూరు, సీఎల్ఎన్‌పల్లెల పరిధిలో పంటలు నీట మునిగాయి. మండలంలోని కాంబాకం చెరువు కలుజుకు గండి పడింది. నీటి ప్రవాహానికి పొలాల్లో మట్టి మేట వేసింది. తహసీల్దార్ సుధీర్, ఎస్‌ఐ మల్లికార్జున పరిస్థితిని సమీక్షించారు.


ట్రాక్టర్‌లో కార్మికుల తరలింపు

చెరువు గండ్లకు ఇసుక బస్తాలతో కట్టడి


వేణుగోపాలపురం చెరువు కలుజు, కుక్కంబాకం కొత్త చెరువు బొగడలకు మరమ్మతులు

బుచ్చినాయుడుకండ్రిగ, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): మండలంలో వర్షాలకు గండ్లు పడిన కుక్కంబాకం, వేణుగోపాలపురం చెరువులకు అధికారులు ఇసుక బస్తాలు వేసి కట్టడి చేశారు. కుక్కంబాకం కొత్త చెరువుకు బుధవారం బొగడ పడంతో రైతులు ఎక్స్‌కవేటర్ సాయంతో పూడ్చారు. అయినా చెరువు నుంచి నీరు దిగువకు పారుతుం డడంతో తహసీల్దార్ శ్రీదేవి, ఇతర అధికారులు శుక్రవారం ఇసుక బస్తాలు వేసి నీటికి అడ్డుకట్ట వేశారు. అదే విధంగా వీఎస్‌పురం పంచాయతీలోని వేణగోపాలపురంలోని చెరువు కలుజుకు బొగడ పడటంతో ఇసుక బస్తాలు వేశారు. కనమనంబేడు, కారణిమిట్టల్లో నీట మునిగిన వరి చేలను తహసీల్దార్ శ్రీదేవి, ఎంపీడీవో వెంకటరత్నమ్మ, ఏవో షణ్ముగం పరిశీలించారు.

ఆలయ అభివృద్ధికి సమన్వయంతో ముందుకెళ్తాం

పల్లికొండేశ్వరాలయ ట్రస్టు బోర్డు చైర్మన్ పద్మనాభరాజు

నాగలాపురం, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): సురుటుపల్లి పళ్లికొండేశ్వర ఆలయ అభివృద్ధితో పాటు తనకు ఈ పదవి రావడానికి కారకులైన టీడీపీ శ్రేణుల సంక్షేమం, పార్టీ ఐక్యత కోసం సమన్వయంతో ముందుకెళ్తానని ఆలయ పాలకమండలి చైర్మన్ పద్మనాభరాజు తెలిపారు. శుక్రవారం ఉదయం స్వామిసేవలో పాల్గొన్న అనంతరం మీడియాతో ఆయన మాట్లాడారు. శివేచ్ఛతో తనకు ఈ పదవి దక్కిందని, అయితే దీనిపై కొందరు లేనిపోని రాద్ధాంతం సృష్టిస్తున్నారని వాపోయారు. తాను పార్టీకి విధేయుడిగా ఉంటూ, తన భార్య మధుబాల పిచ్చాటూరు ఎంపీపీగా ఉన్న రోజుల్లో ప్రజాసేవే లక్ష్యంగా పని చేశానన్నారు. ఏ రోజు తన మీద అవినీతి అంటిన దాఖలాలు లేవన్నారు. తుఫాను కారణంగా ఆలయం వద్ద జరగాల్సిన ఆత్మీయ సమావేశం వాయిదా పడిందన్నారు. నిందలు మోపడం సులభమే కానీ కర్మఫలం ఎవరిని వదలదన్నారు. వ్యాపారం చేయడం తన వృత్తి అని, అది తప్పు అని ఏ రాజ్యాంగంలో లేదన్నారు. ఆరోపణలు చేసేవారు ఇది తెలుసుకుంటే మంచిదన్నారు. కోర్టులు, కేసులు తనకు కొత్త కాదని తాను ఏ తప్పు చేయలదన్నారు. పాలక మండలిసభ్యులు హంస రుద్రయ్య, నెల్సన్ మండేలా, కవిత పాల్గొన్నారు.

పళ్లికొండేశ్వరాలయానికి బంగారు మాంగళ్యం వితరణ



నాగలాపురం, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): మండలంలోని సురుటుపల్లి పళ్లికొండేశ్వర ఆలయానికి హైదరాబాద్‌కి చెందిన డాక్టర్ సెంథిల్‌కుమార్ కుటుంబ సభ్యులు రూ.2.16లక్షల విలువైన బంగారు మాంగళ్యాన్ని వితరణ చేశారు. శుక్రవారం ఆలయ చైర్మన్ కార్యాలయంలో చైర్మన్ పద్మనాభరాజుకి అందించారు. దాత కుటుంబ సభ్యులకు ప్రత్యేక దర్శన ఏర్పాట్లు కల్పించారు. ఈ కార్యక్రమంలో బోర్డు సభ్యులు హంస రుద్రయ్య, నెల్సన్ మండేలా, కవిత తదితరులు పాల్గొన్నారు.

ముక్కంటి ధర్మకర్తలి మండలిలో

మాల సామాజిక వర్గానికి మొండిచేయి!

శ్రీకాళహస్తి, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): ముక్కంటి ఆలయ ధర్మకర్తలమండలి నియామకంలో మాలా సామాజిక వర్గానికి కూటమి ప్రభుత్వం మొండిచేయి చూపడం బాధాకరమని జైభీమ్ ఆర్మీ వ్యవస్థాపకుడు పులి శ్రీకాంత్ శుక్రవారం ప్రకటనలో వాపోయారు. శ్రీకాళహస్తీశ్వరాలయానికి ప్రతిసారి ట్రస్టుబోర్డులో తమ సామాజిక వర్గం నుంచి సభ్యులకు అవకాశం లభించిందన్నారు. మహాశివరాత్రి ఉత్సవాల్లో సైతం మొదటి ఉభయదారులుగా తమ సామాజిక వర్గానికే హక్కు కల్పించారని చెప్పారు. కానీ తొలిసారి మాల సామాజిక వర్గాన్ని పూర్తిగా విస్మరించడంపై అందరిలో ఆవేదన కలిగిందన్నారు.

19న స్వర్ణమ్మకు కలశ పూజలు

శ్రీకాళహస్తి, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయ ఆధ్వర్యంలో నవంబరు 19న స్వర్ణముఖి నదికి కలశపూజలు నిర్వహించనున్నట్లు ఈవో బాపిరెడ్డి తెలిపారు. దూప, దీప, నైవేద్యం, మహాదీపారాధన నిర్వహిస్తామని తెలిపారు.

కొట్టుకుపోయిన 'పూడి' మట్టి వంతెన

కేవీబీపురం, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): మండలంలోని రాజులకండ్రిగ సమీపంలో కాళంగి ఏరుపై మట్టి వంతెన బుధవారం రాత్రి కొట్టుకుపోయింది. గురువారం ఉదయం మట్టితోలి వంతెనను పునరుద్ధరించారు. మధ్యాహ్నం సత్యవేడు ఎమ్మెల్యే ఆదిమూలం పరిశీలించారు. గురువారం రాత్రి కురిసిన భారీ వర్షానికి మట్టి వంతెన మళ్లీ కొట్టుకుపోయింది. దీంతో పూడి గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. మళ్లీ అదే ప్రాంతంలో తాత్కాలికంగా మట్టితో వంతెన ఏర్పాటుకు సన్నాహాలు చేస్తున్నారు. మండలంలోని జయలక్ష్మీపురం చుట్టూ కాళంగి నీరు పారుతుండడంతో గ్రామస్తులు ఇళ్లకే పరిమితమయ్యారు. ఇప్పటి వరకు అధికారులు కూడా ఎవరూ తమను పట్టించుకో లేదని, ఫోన్లు చేసినా సమాధానం ఇవ్వడం లేదని వాపోయారు.


గురువారం ఉదయం ఇలా...


శుక్రవారం ఉదయానికి ఇలా...

నేడు టీడీపీ కార్యాలయం ప్రారంభం

ఏర్పేడు, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో హెచ్‌పీ గ్యాస్ సమీపంలో టీడీపీ నూతన కార్యాలయం ప్రారంభం కానునంది. సాయంత్రం 5గంటలకు ఎమ్మెల్యే సుధీర్ ప్రారంభించనున్నట్లు టీడీపీ మండల అధ్యక్షుడు పేరం నాగరాజు నాయుడు తెలిపారు. నాయకులు, కార్యకర్తలు తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు.

కోర్టుకు టీడీపీ నాయకుల హాజరు



శ్రీకాళహస్తి, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని న్యాయస్థానంలో కోర్టు వాయిదాకు పలువురు టీడీపీ నాయకులు శుక్రవారం హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వంలో తమ పార్టీ అధినేత చంద్రబాబు అక్రమ అరెస్టు సందర్భంగా చేపట్టిన శాంతియుత నిరసన సందర్భంగా తమపై కేసులు బనాయించారన్నారు. అందులో భాగంగా కోర్టు వాయిదాకు హాజరైనట్లు తెలిపారు. చెంచయ్యనాయుడు, కాసరం రమేష్, మిన్నల రవి, సుబ్బయ్య, వినయ్, కృష్ణమనాయుడు, లక్ష్మణ్, బషీర్, రామకృష్ణ, జగదీశ్వర్‌రెడ్డి, సుదర్శన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆవు గల్లంతు

శ్రీకాళహస్తి, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): తెలుగుగంగ కాలువ నీటి ప్రవాహంలో ఆవు కొట్టుకుపోయింది. తొట్టంబేడు మండలం చిన్నకనపర్తికి చెందిన రైతు పాండు పాడిపై ఆధారపడి జీవనం సాగిస్తుంటాడు. శుక్రవారం సమీపంలో మేతకు వెళ్లి తెలుగుగంగ కాలువలో ఆవు కొట్టుకుపోయింది.

వ్యాసరచన పోటీలు

ఏర్పేడు, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో పోలీసు అమరవీరుల సంస్మరణ దినం పై విద్యార్థులకు వ్యాసరచన పోటీలను నిర్వహించారు. సీఐ శ్రీకాంత్‌రెడ్డి ఈ పోటీలను పర్యవేక్షించారు. అనంతరం విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఎస్‌ఐ శ్రీకాంత్‌రెడ్డి పాల్గొన్నారు.

అపోలో పరిశ్రమ బస్సుల అడ్డగింత



వరదయ్యపాళెం, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అపోలో పరిశ్రమకు కార్మికులను తరలించే బస్సును స్థానికులు శుక్రవారం అడ్డుకున్నారు. నాలుగు రోజుల క్రితం వీకేఆర్‌పై కాలనీ వద్ద ఎదురుగా వస్తున్న ఆటోను అపోలో పరిశ్రమకు చెందిన బస్సు ఢీ కొట్టింది, ఈ ఘటనలో ఆటో బోల్తా పడగా అందులో ప్రయాణిస్తున్న నలుగురికి గాయాలయ్యాయి. అపోలో పరి శ్రమ యాజమాన్యం ఆటోలో ప్రయాణిస్తున్న కార్మికుల ఆరోగ్య పరిస్థితి గురించి స్పందించక పోవడంతో ఆగ్రహం వ్యక్తం చేసిన బాధిత కార్మిక కుటుంబాల బంధువులు పరిశ్రమ బస్సులను అడ్డగించారు.

తగ్గని స్వర్ణమ్మ ఉధృతి



ఏర్పేడు, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): మండలంలో శుక్రవారం కూడా వర్షం కురిసింది. మధ్యాహ్నం ఒంటి గంటకు ప్రారంభమైన వర్షం రెండున్నర గంటలు కురిసింది. దీంతో స్వర్ణముఖి నదిలోకి భారీగా నీరుచేరడంతో ఉధృతి తగ్గలేదు. మోదుగులపాళెం - కొత్తవీరాపురం మధ్య ఉన్న స్వర్ణముఖి లోలెవెల్ వంతెనపై ఉధృతంగా నీరు ప్రవహిస్తోంది. ఏర్పేడు మండల కేంద్రానికి వచ్చే ప్రజలు కందాడు, ముసలిపేడు మీదుగా శ్రీకాళహస్తికి చేరుకుని తిరిగి ఏర్పేడుకు వస్తున్నారు.

అభివృద్ధికి మారుపేరు సీఎం చంద్రబాబు: ఎమ్మెల్యే

శ్రీకాళహస్తి, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): అభివృద్ధికి మారుపేరు సీఎం చంద్రబాబు అని ఎమ్మెల్యే సుధీర్ అన్నారు. పట్టణంలోని పంచాయతీరాజ్ అతిథిగృహంలో శుక్రవారం జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ... విశాఖకు గూగుల్ సంస్థ రావడంతో నిరుద్యోగ యువతకు ఉద్యోగ అకాశాలు లభిస్తాయని తెలిపారు. ప్రతిపక్ష నాయకులు వారి ఇష్టానుసారం గూగుల్ సంస్థ గురించి విమర్శించడం మంచి పద్ధతి కాదన్నారు.

1నుంచి 10వ తేదీ వరకు రాజీవ్‌నగర్ డ్రైవ్

పట్టణంలోని రాజీవ్‌నగర్‌లో నవంబరు 1 నుంచి 10వ తేదీ వరకు రాజీవ్‌నగర్ డ్రైవ్‌ను అధికారులు చేపడుతున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. గతంలో ఇచ్చిన పట్టాలను విచారణ చేసేందుకు ఈ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నామన్నారు. తాను ప్రతిరోజు గంట పాటు పాల్గొంటానని గతంలో ఒరిజినల్ పట్టాలు ఉన్న పట్టాదారులు వాటితో పాటు ఆధార్‌కార్డు తీసుకురావాల్సి ఉంటుందన్నారు. ఆర్డీవో, తహసీల్దార్లు, వీఆర్వోలు పాల్గొనే ఈ కార్యక్రమంలో అక్కడికక్కడే ఈకేవైసీ చేయిస్తామని తెలిపారు. అలాగే ఈనెల 25న పట్టణంలోని నారద పుష్కరణి సమీపంలో ఉన్న విక్రమ్ జూనియర్ కళాశాలలో మెగా జాబ్‌మేళా జరుగుతుందన్నారు. దీన్ని నియోజకవర్గంలోని అర్హులైన యువత సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే సుధీర్ పిలుపునిచ్చారు.

ఏడేళ్లుగా అరణియార్ గేట్లు ఎత్తే భాగ్యం: ఆదిమూలం

పిచ్చాటూరు, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): ఏడేళ్లుగా అరణియార్ పూర్తిస్థాయిలో నిండి గేట్లను ఎత్తే భాగ్యం కలగడం అదృష్టంగా భావిస్తున్నానని ఎమ్మెల్యే ఆదిమూలం అన్నారు. ఇటీవల కురుస్తున్న వర్షాలకు ప్రాజెక్టు నీటి మట్టం 28.5 అడుగులకు చేరుకుంది. జలాశయానికి సుమారు 600 క్యూసెక్కుల నీరు చేరుతోంది. దీంతో శుక్రవారం మధ్యాహ్నం 12 గంటలకు ఎమ్మెల్యే గేట్ల వద్దకు చేరుకున్నారు. అరణియార్ అధునాతన స్పిల్‌వే గేట్లకు, గంగాదేవికి ఎమ్మెల్యే వేద పండితుల సమక్షంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం రెండు గేట్లు ఎత్తి నీటిని విడుదల చేశారు. కార్యక్రమంలో ఏఎంసీ మాజీ చైర్మన్ ఇళంగోవన్‌రెడ్డి, అరణియార్ ఆయకట్టు చైర్మన్ రవిరెడ్డి, ఇరిగేషన్ డీఈ శ్రీనివాసులు, ఏఈఈ ధరణి కుమార్, ఎంపీడీవో మహ్మద్‌రఫి, ట్రాన్స్‌కో ఏఈ ఏఈ సుబ్రహ్మణ్యం, టీడీపీ నాయకులు పద్దురాజు, వాసురెడ్డి, భక్తారెడ్డి, సుమాంజలి పాల్గొన్నారు. కాగా ప్రాజెక్ట్ పూర్తిస్థాయి నీటి మట్టం 32 అడుగులు కాగా 31 అడుగుల మేరు నీరు నిల్వ ఉంచుతారు.

కూరగాయల పంపిణీ



శ్రీకాళహస్తి, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఈశ్వరయ్య గిరిజన కాలనీ ప్రజలకు 2వ వార్డు కేఎంపల్లికు చెందిన దొడ్ల మునిరాజా శుక్రవారం కూరగాయాలు, పాలు, బ్రెడ్లు పంపిణీ చేశారు. వర్షాలకు ఈశ్వరయ్య గిరిజనకాలనీలోకి నీరు చేరి ప్రజలు ఇబ్బంది పడడమే కాకుండా పనులకు వెళ్లలేక ఇళ్లకే పరిమితం అయ్యారన్నారు. దీంతో వారికి నిత్యావసరాలు పంపిణీ చేసినట్టు తెలిపారు. సీపీఐ ఏరియా కార్యదర్శి గురవయ్య, పట్టణ కార్యదర్శి రొద్ద గోపి, నాయకులు జనార్దన్, మునిరాజా, మునెమ్మ, గంగమ్మ తదితరులు పాల్గొన్నారు.

లోతట్టు ప్రాంతాల్లో కాంక్రీట్ వాల్

రేణిగుంట, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): తరచూ కురిసే వర్షాలకు నీటి ముంపునకు గురవుతున్న నేతాజీ, భగత్‌సింగ్, రజక కాలనీలో శాశ్వత పరిష్కారంగా కాంక్రీట్ గోడ్ల నిర్మిస్తామని ఎమ్మెల్యే సుధీర్ చెప్పారు. శుక్రవారం పట్టణంలోని లోతట్టు ప్రాంతాలను ఆయన పరిశీలించారు. ఎంపీడీవో రవిచంద్ర, తహసీల్దార్, చంద్రశేఖర్ రెడ్డి, ఈవోపీఆర్డీ ప్రభురావు, ట్రాన్స్‌కో డీఈఈ రమేష్ బాబు, టీడీపీ నాయకులు మునిచంద్రారెడ్డి, మహబూబ్ బాషా పాల్గొన్నారు.

అమ్మవారి విగ్రహం ధ్వంసం చేసిన యువకుడి అరెస్ట్

రేణిగుంట, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): మద్యంమత్తులో అమ్మవారి విగ్రహాన్ని ధ్వంసం చేసిన యువకుడిని అరెస్టు చేసి నట్టు ఏఎస్పీ రవి మనోహర్ ఆచారి తెలిపారు. తూకివాకం పంచాయతీ ఎస్ఎన్‌పురంలో రోడ్డు పక్కన బాట గంగమ్మ ఆలయంలో అమ్మవారి విగ్రహాన్ని మద్యం మత్తులో నవీన్ గురువారం ధ్వంసం చేసిన విషయం విదితమే. ఈక్రమంలో నవీన్‌ను అరెస్ట్ చేసినట్టు ఏఎస్పీ తెలిపారు.

మంత్రి మనోహర్‌కు ఘనస్వాగతం

రేణిగుంట, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి మనోహర్‌కు ఘన స్వాగతం లభించింది. శుక్రవారం మధ్యాహ్నం శ్రీవారి దర్శనార్థం విజయవాడ నుంచి ఇండిగో విమానంలో తిరుపతి విమానాశ్రయం చేరుకున్న ఆయనకు తిరుపతి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, రాష్ట్ర హస్తకళల అభివృద్ధి సంస్థ చైర్మన్ పసుపులేటి హరిప్రసాద్, జనసేన నాయకులు కిరణ్ రాయల్, మనోహర్ తదితరులు స్వాగతం పలికారు. అనంతరం ఆయన రోడ్డు మార్గాన తిరుపతికి బయలుదేరి వెళ్లారు.

ప్రైవేటీకరణ ఆపండి: చింతామోహన్

రేణిగుంట, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): తిరుపతి విమానాశ్రయం, విశాఖ ఉక్కు ఫ్యాక్టరీ ప్రైవేటీకరణ ఆపాలని కేంద్ర మాజీ మంత్రి చింతామోహన్ డిమాండ్ చేశారు. శుక్రవారం మధ్యాహ్నం ఆర్టీసీ బస్టాండ్‌లో కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... 3 వేల ఎకరాల్లో విస్తీర్ణంలో ఉన్న తిరుపతి విమానాశ్రయాన్ని అదానీకి అప్పగించాలని పౌర విమానాయ శాఖ మంత్రి కార్యాలయం చాప కింద నీరులా దస్త్రాలను సిద్ధం చేస్తోందని ఆరోపించారు. దీనిపై తక్షణం సీఎం చంద్రబాబు స్పందించి ప్రైవేటీకరణ జరగకుండా చూడాలని కోరారు. రావణ తదితరులు పాల్గొన్నారు.

ఆధార్ కేంద్రంలో అధిక వసూళ్లు

సిబ్బంది తీరుపై బ్యాంకు మేనేజరుకు ఫిర్యాదు

శ్రీకాళహస్తి, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఆధార్ సేవా కేంద్రాల్లో ధరల పట్టికను పాటించడంలేదన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. శుక్రవారం పట్టణంలోని ఓ బ్యాంకులో ఉచిత సేవకు రూ.వంద ముకుపిండి వసూలు చేయడంపై ఆధార్ పొందిన పౌరుడు రసీదు ఇవ్వాలని డిమాండ్ చేశాడు. సిబ్బంది నీళ్లు నమలడంతో బ్యాంకు మేనేజరుకు ఫిర్యాదు చేశాడు. శుక్రవారం పట్టణానికి చెందిన వ్యక్తి ఆరేళ్ల తమ పాపకు ఆధార్‌లో వేలిముద్రలను నమోదు చేసేందుకు జయరామరావువీధిలోని ఓ బ్యాంకు వద్దకు వెళ్లాడు. పాపకు మ్యాండేటరీ విభాగంలో ఉచిత సేవ పూర్తయిన తరువాత అక్కడి సిబ్బంది రూ.100ను డిమాండ్ చేశారు. ఆ మేరకు రూ.100 చెల్లించిన వ్యక్తి తనకు రసీదును ఇవ్వాలని కోరారు. దాంతో నీళ్లు నమిలిన సిబ్బంది రూ.100ను తిరిగి ఇచ్చి అక్కడ ఉన్న వారి నుంచి తిరుగుబాటు రాకుండా పరిస్థితిని సర్దుబాటు చేశారు.

27న నారద పుష్కరిణిలో కార్తీక దీపోత్సవం

శ్రీకాళహస్తి, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): కార్తీక మాసాన్ని పురస్కరించుకుని శ్రీకాళహస్తీశ్వరాలయ ఆధ్వర్యంలో ఈనెల 27న సోమవారం పట్టణంలోని నారద పుష్కరిణిలో కార్తీక దీపోత్సవం నిర్వహించనున్నట్లు ఈవో తెలిపారు. నవంబరు 3న వైష్ణవ కోనేరులో, 10న భరద్వాజ తీర్థంలో సాయంత్రం 6గంటల సమయంలో కార్తీక దీపోత్సవం జరుగుతుందన్నారు.

నేత్రపర్వంగా ఆకాశదీపం



శ్రీకాళహస్తి, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరాలయంలో శుక్రవారం ఆకాశ దీపాన్ని కన్నుల పండుగగా వెలిగించారు. వాయులింగేశ్వరుడి క్షేత్రంలో కార్తీక మాసాన్ని పురస్కరించుకుని ప్రతి రోజు ఆకాశదీపాన్ని వెలిగిస్తుంటారు. ఇందులో భాగంగా ఆలయ వేదపండితులు ఊంజల్ మండపం వద్ద కార్తీక దీపానికి పూజలు చేశారు. అనంతరం స్తూపానికి జ్యోతిని అమర్చి ఆకాశదీపంగా ఎగురవేశారు. భక్తులు విశేషంగా ఆకాశ దీపాన్ని దర్శించుకున్నారు.

అలరించిన నృత్య ప్రదర్శన



శ్రీకాళహస్తి, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయంలోని బ్రహ్మగుడి వద్ద కార్తీక మాసాన్ని పురస్కరించుకుని సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా శ్రీకాళహస్తి పట్టణంలోని శివాజ్ఞ శివాని నాట్యాలయానికి చెందిన కళాకారుల నృత్య ప్రదర్శన అలరించింది. పలు శివనామ కీర్తనలకు వారు నృత్యం చేశారు. అనంతరం వారికి ఆలయ అధికారులు జ్ఞాపికలు, ప్రశంసాపత్రాలు అందజేశారు.

కోటి సంతకాల సేకరణ



శ్రీకాళహస్తి, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా పట్టణంలోని 1వ వార్డు వీఎంపల్లిలో ముక్కంటి ఆలయ పాలకమండలి మాజీ అధ్యక్షుడు అంజూరు శ్రీనివాసులు కోటి సంతకాల సేకరణ నిర్వహించారు. వైద్య కళాశాలలను ప్రైవేటీకరిస్తే పేద విద్యార్థులకు వైద్య విద్య దూరమవుతుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వమే వైద్యకళాశాలలను నిర్వహించాలన్నారు. పి.రమణయ్య, సురేష్, రామ చంద్ర య్య, కమలాకర్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.